http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 16 సెప్టెంబర్ 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# టెండర్స్ పిలవండి



- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు
- వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి
- ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశం
- ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలి
- గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలి
- వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ అధికారం సర్పంచ్‌లకే అప్పగించాలి

హైదరాబాద్

వీధిదీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో సీఎం రేవత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశం చేశారు. వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ అధికారం సర్పంచ్‌లకే అప్పగించాలని.. ఎంపీడీఓ స్థాయిలో పర్యవేక్షణ చేయాలని, అలాగే ప్రతి పోల్ సర్వే చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. ఈ సమావేశానికి - మిగతా3లో



## చట్టవిరుద్ధంగా ఉంటే.. 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తాం

- ఈసీకి 'సుప్రీం' హెచ్చరిక
- రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో సరైన నిబంధనలను పాటించిందని భావిస్తున్నాం
- ప్రస్తుతం ఈ విషయంపై తాము అసంపూర్తి అభిప్రాయాలు వెల్లడించలేం
- అక్టోబర్ 7న తుది వాదనలు విన్న తర్వాత తీర్పును వెలువరిస్తాం

## కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే
# కాలేజీలు మూత

- కేసీఆర్‌కు, మీకు తేడా ఏముంది?
- ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లని చంకలు గుద్దుకున్నారు కదా?
- మీ నిర్వాకంవల్లే 15 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైన కన్పిస్తలేదా?
- ఆనాడు చెక్కులిచ్చి బౌన్స్ చేసి ప్రజలను పిచ్చోళ్లను చేశారు
- మీరు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నారే తప్ప పైసలియ్యడం లేదు
- మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీలకు వేల కోట్లు ఖర్చు పెడతారు
- పేద విద్యార్థుల కోసం 8 వేల కోట్లు ఖర్చు చేయలేరా
- తుపాకీ ఆర్మీ, పోలీసుల చేతుల్లోనే ఉండాల్సిందే
- తుపాకీ చేతపట్టి చర్చలు జరపాలంటే భయపడే పిరికి ప్రభుత్వం మోదీది కాదు
- వచ్చే మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలించి తీరుతాం
- యూరియాపై రైతుల గోస ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే
- ప్రణాళిక లేకుండా చేయడంవల్లే ఈ దుస్థితి
- బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చేష్టలుడిగి చూస్తున్నారు
- రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- జాతీయ జెండా ఎగరనీయబోమని, ఎన్నికలే జరపనీయబోం



హైదరాబాద్

ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లం తామేనని సంకలు గుద్దుకున్న కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే కాలేజీలు మూతపడి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు కనబడటం లేదా? రాష్ట్ర బడ్జెట్ లో నుండి రూ.8 వేల - మిగతా3లో

## ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల
# బంద్‌కు భాజపా మద్దతు: రామచందర్‌రావు



హైదరాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రైవేటు కళాశాలల యాజమాన్యా లు చేపట్టిన బంద్‌కు మద్దతు తెలుపుతున్నామని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ప్రైవేటు కళాశాలలకు ఉందని చెప్పారు. విద్యావ్యవస్థను గత ప్రభుత్వం చెడగొట్టిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వమైనా యాజమాన్యాలతో చర్చించి వారికి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులు నష్టపోతున్నా రన్నారు. విద్యపై ప్రభుత్వ వైఖరిని భాజపా తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు.



# కాంగ్రెస్ నేతల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్ మార్కెట్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ప్రభుత్వ అలసత్వాన్ని తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ ప్రభుత్వ నిర్వాకంతో 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు అంధకారం
- రేవంత్ పాలనలో హైదరాబాద్‌లో పెరిగిన క్రైమ్ రేట్
- జూబ్లీహిల్స్ నుంచే కేసీఆర్ జైత్రయాత్ర మొదలవ్వాలి
- జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

# నవంబర్‌లో లోకల్ ఎన్నికలు

- జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు
- అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ ప్రారంభంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను షెడ్యూల్
- గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించడానికి గతంలో నిర్ణయించిన సెప్టెంబర్ 30 గడువును పొడిగించాలని కోరుతూ ప్రభుత్వం వచ్చే వారం హైకోర్టును ఆశ్రయించడానికి ప్రయత్నాలు




హైదరాబాద్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయని అందరూ భావిస్తున్నారు. భారత ఎన్నికల సంఘం బీహార్ రాష్ట్ర ఎన్నికలతో పాటు అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ ప్రారంభంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను షెడ్యూల్ చేస్తుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. దీంతో నవంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించడానికి గతంలో - మిగతా3లో

## దేశంలోని చొరబాటుదారులను
# వెనక్కి పంపుతాం

- రాష్ట్రీయ జనతా దళ్ కాంగ్రెస్ పార్టీలు రెండూ బిహార్ ఐడెంటిటీని ప్రమాదంలో పడేస్తున్నాయి
- ఆర్జేడీ-కాంగ్రెస్ హయాంలో బిహార్ ఇబ్బందుల పాలైంది
- బిహార్ అభివృద్ధిని చూసి కాంగ్రెస్, ఆర్జేడీ ఓర్వలేకున్నాయి
- సొంత కుటుంబాల గురించి మాత్రమే ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తారు



## అమెరికా చెప్పినట్టు చేస్తే ప్రతిచర్యలు తప్పవు.. చైనా స్ట్రాంగ్ వార్నింగ్

## హిందూమతంలో సమానత్వం ఉంటే వేరే మతంలోకి ఎందుకు మారుతారు?

- కర్ణాటక సీఎం వివాదాస్పద వ్యాఖ్యలు
- హిందూ మతంలో సమానత్వం ఉంటే మరో మతంలోకి మారడమనేది ఉండదు
- ప్రజలను మతం మారమని ఏ రాజకీయ పార్టీ కోరదని, అయినప్పటికీ మతమార్పిడులు జరుగుతున్నాయి







# త్వరలో ట్రేడ్‌డీల్ కుదరనుందా?

- భారత్‌కు రానున్న అమెరికా ప్రతినిధి
- భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చల్లో అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే
- అయితే ఇప్పుడు వాటిలో కదలిక రానున్నట్లు కనిపిస్తోంది.
- రష్యాతో భారత్ కొనసాగిస్తున్న విధానాలపై ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో పదే పదే నోరుపారేసుకుంటున్న సంగతి తెలిసిందే.

# నంత్ అంబానీ వంతారాకు ఊరట

అనంత్ అంబానీ స్థాపించిన వంతారా సంస్థకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. నిబంధనలకు అనుగుణంగా వంతారాకు ఆలయ ఏనుగులను తరలిస్తే.. అందులో ఎలాంటి తప్పు లేదని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ క్రమంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏనుగుల తరలింపుపై సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. గుజరాత్ జామ్‌నగర్‌లోని వంతారా వన్యప్రాణుల సంరక్షణ కేంద్రానికి ఏనుగుల తరలింపును సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిపింది. ఈ క్రమంలో ఈ విషయంపై దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా వంతారాకు క్లీన్‌చిట్ ఇచ్చినట్లు జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ పీబీ వరాలేలతో కూడిన ధర్మాసనం గుర్తు చేసింది. ఏనుగుల తరలింపులో తప్పులేమీ లేదు, నిబంధనల ప్రకారం జరిగితే సరే. ఏనుగులు బాధపడుతున్నాయ్ అని చెప్పినప్పుడు.. దానికి ఆధారాలేమిటో కూడా పిటిషనర్ చూపించాలి కదా. ఇది దేశ గర్వంగా భావించే విషయం. కాబట్టి దీన్ని తక్కువ చేయకండి. పిటిషన్‌లో పేర్కొన్న ఆరోపణలు అస్పష్టమైనవిగా కనిపిస్తున్నాయి. విచారణ కొనసాగించాలంటే, పిటిషనర్లు తమ వాదనలను స్పష్టంగా, ఆధారాలతో సమర్పించాల్సిన అవసరం ఉంది అని కోర్టు అభిప్రాయపడింది. ఈ క్రమంలో.. వంతారాలో బందీలుగా ఉన్న ఏనుగులను వాటి యజమానులకు తిరిగి ఇవ్వడానికి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ జయసుకిన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను అస్పష్టమైనదిగా న్యాయస్థానం తోసిపుచ్చిం ది. వంతారాపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదికను పరిశీలించిన అనంతరం ఈవిషయంపై వివరణాత్మక ఉత్తర్వులు జారీ

చేస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. వంతారాలో చట్టాలను పాటించట్లేదని.. విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి ఏనుగులను అక్రమంగా తీసుకువస్తున్నారని ఆరోపిస్తూ.. ఇటీవల పలు వన్యప్రాణుల సంరక్షణ సంస్థలు సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశాయి. దీనిపై దర్యాప్తు చేయడానికి ఇటీవల సుప్రీంకోర్టు జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలో నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ.. వంతారా సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలు, వన్యప్రాణుల సంక్షేమం, ఆర్థిక పారదర్శకత వంటి అంశాల్లో సవ్యంగా ఉందంటూ నివేదికను ఇచ్చింది. ఆ నివేదికను సర్వోన్నత న్యాయస్థానం ఆమోదించింది కూడా. అయితే ఇదంతా బయటి దేశాల నుంచి జరుగుతున్న కుట్ర అని, భారత్ చేస్తున్న మంచి పనులపై జంతువుల వేటను అనుమతించే దేశాలు ఈవిధంగా అభ్యంతరాలు లేవనెత్తుతున్నాయని.. ఈ విషయంలో దర్యాప్తునకు తాము అన్నివిధాలా సిట్‌కు సహకరిస్తామని వంతారా తరఫు న్యాయవాది మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు.

# 'ఆ పప్పులు ఉడకవు.. శభాష్ భారత్'

రష్యా చమురు, ఆయుధ కొనుగోళ్ల విషయంలో భారత్‌పై ట్రంప్ కోపం ఇంకా చల్లారినట్లు కనిపించడం లేదు. ఈ క్రమంలో ఈయూ, జీ7, నాటో సహా పలు దేశాలపైనా ఆయన ఒత్తిడి చేస్తుండడం చూస్తున్నాం. అమెరికాలాగే ఆ దేశాలకు భారతీయ వస్తువులపై సుంకాల మోత మోగించాలంటూ సూచిస్తున్నారాయన. అయితే ఈ విషయంలో ఆయనకు చేదు అనుభవమే ఎదురవుతోంది!. తాజాగా ఈ పరిణామంపై రష్యా స్పందించింది. భారత్‌తో తమ సంబంధాలు స్థిరంగా కొనసాగుతున్నాయని.. ఇరు దేశాల సంబంధాలను దెబ్బ తీయాలనే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లో ఫలించబోవని స్పష్టం చేసింది. ఈ క్రమంలో అమెరికాకు మెత్తగా మొట్టికాయలు వేసింది. "ఇండియా-రష్యా సంబంధాలు స్థిరంగా, ధైర్యంగా ముందుకు సాగుతున్నాయి. ఈ బంధాన్ని భంగం చేయాలనే ప్రయత్నాలు విఫలం కాక తప్పదు. అమెరికా, నాటో దేశాల ఒత్తిడిని ఎదుర్కొంటూ రష్యా చమురు కొనుగోలు కొనసాగిస్తున్నందుకు ఇండియాను అభినందించాల్సిందే. బాహ్య బెదిరింపులు, విమర్శలు ఉన్నా, ఇండియా తన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తుండటం గమనార్హం అని రష్యా విదేశాంగ శాఖ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొంది. ఇండియా వైఖరి.. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇండియా-రష్యా స్నేహబంధం స్ఫూర్తి, సంప్రదాయాలపై ఆధారపడి ఉంది. ఇది అంతర్జాతీయ వ్యవహారాల్లో వ్యూహాత్మక స్వయం ఇండియా నిర్ణయాన్ని ప్రతిబింబిస్తోంది. ఇరు దేశాలు మిలిటరీ ఉత్పత్తులు, అంతరిక్ష మిషన్లు, అణు శక్తి, రష్యన్ చమురు పరిశోధనలో భారత పెట్టుబడులు వంటి రంగాల్లో పనిచేస్తున్నాయి. నూతన చెల్లింపు వ్యవస్థలు, జాతీయ కరెన్సీల వినియోగం, పరస్పర రవాణా మార్గాల అభివృద్ధి వంటి అంశాల్లో కూడా సహకారం కొనసాగుతోంది అని పేర్కొంది.




ఇదిలా ఉంటే.. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం భారత ఉత్పత్తులపై తొలుత 25% ప్రతీకార సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. అటుపై రష్యా చమురు, రక్షణ సామాగ్రి కొనుగోళ్ల నేపథ్యంతో పెనాల్టీ కింద మరో 25% శాతం విధించారు. ఈ టారిఫ్‌లను భారత్ అన్యాయంగా పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం జాతీయ ప్రయోజనాల, మార్కెట్ అవసరాల ఆధారంగా జరుగుతోందని భారత్ స్పష్టం చేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో.. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలే చేశారు. రష్యా భారత్ ఆర్థిక వ్యవస్థలు డెడ్.. వాటి గురించి పట్టించుకోవాల్సిన అవసరం తనకు లేదంటూ సంచలన కామెంట్ చేశారు. అయినప్పటికీ.. అమెరికా ఒత్తిడికి తలవంచే ప్రసక్తే లేదని, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే హక్కు తమ దేశానికి ఉందని భారత్ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగానే ఉక్రెయిన్ శాంతి చర్చల్లో భాగంగా అలస్కాలో పుతిన్‌తో భేటీ తర్వాత ట్రంప్ స్వరం కాస్త తగ్గింది. ఉక్రెయిన్ డీల్ కుదిరితే భారత సుంకాల విషయంలో ఆలోచన చేయొచ్చని అన్నారాయన. అయితే.. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరాలంటే.. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై రాయితీలు ఇవ్వలేమని కుండబద్దలు కొట్టేసింది. ఈ క్రమంలో.. ఈ రంగాలను రెడ్ లైన్స్‌గా అభివర్ణించింది. మరోవైపు.. ఎగుమతిదారులపై ప్రభావం తగ్గించేందుకు భారత ప్రభుత్వం ఆర్థిక మద్దతు ప్యాకేజీలు ప్రకటించే అవకాశముందనే విశ్లేషణ నడిచింది. ఈలోపు ట్రంప్-మోదీల పరస్పర సోషల్ మీడియా సంభాషణతో ఈ చర్చలు ముందుకు సాగవచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# త్వరలో ట్రేడ్‌డీల్ కుదరనుందా?

**ఇంటర్నెట్‌డెస్క్:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత మోగించడంతో భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చల్లో అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు వాటిలో కదలిక రానున్నట్లు కనిపిస్తోంది. ఈ రోజు రాత్రికి అమెరికా ప్రతినిధి భారత్‌కు రానున్నారని కేంద్ర ప్రభుత్వ అధికారులు మీడియాకు వెల్లడించారు. దాంతో మంగళవారం రెండు దేశాల మధ్య మళ్లీ చర్చలు జరగనున్నాయని పేర్కొన్నాయి.

మార్చి నుంచి ట్రేడ్ డీల్ కోసం అమెరికా-భారత్ మధ్య వాణిజ్య చర్చలు జరుగుతోన్న సంగతి తెలిసిందే ఇప్పటివరకు ఇరు దేశాల ప్రతినిధులు ఐదు దఫాలుగా చర్చించారు. ఆరవ రౌండ్‌కోసం ఆగస్టు 25న యూఎస్ బృందం భారత్‌కు వస్తుందని భావించారు. కానీ సుంకాల ఎఫెక్ట్‌తో ఆ పర్యటన కాస్తా రద్దయింది. అయితే ఒప్పందంలో మొదటి దశను ఈ ఏడాది అక్టోబర్-నవంబర్ పూర్తి చేయాలని లక్ష్యంగా



పెట్టుకున్నారు. ఇదిలాఉంటే.. భారత ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నానంటూ ట్రంప్ పోస్ట్ పెట్టగా.. తాను కూడా అమెరికా అధ్యక్షుడితో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నానని మన ప్రధాని బదులిచ్చారు. ఈ నేపథ్యంలో యూఎస్ ప్రతినిధి భారత్ పర్యటన చోటుచేసుకుంటోంది.

రష్యాతో భారత్ కొనసాగిస్తున్న విధానాలపై ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో పదే పదే నోరుపారేసుకుంటున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల వేళ.. నవారో మళ్లీ స్పందించారు. చర్చలకు భారత్‌ను ఒప్పించామనే అర్థంలో వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఇరుదేశాల మధ్య చర్చలు సానుకూలంగానే కొనసాగుతున్నాయని, ఇరుపక్షాలు సంతృప్తికరంగా ఉన్నాయని భారత వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల పేర్కొన్నారు. మొదటి విడత ఒప్పందం నవంబర్ నాటికి ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. వీటికి సంబంధించి చర్యలు చేపట్టాలని ఈ ఫిబ్రవరిలో భేటీ సందర్భంగా ట్రంప్-మోదీలు తమ ప్రతినిధి బృందాలను ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్ ఎగుమతులపై 50 శాతం అమెరికా సుంకాల భారం పడుతోంది.

## అమెరికా చెప్పినట్టు చేస్తే ప్రతిచర్యలు తప్పవు.. చైనా స్ట్రాంగ్ వార్నింగ్

చైనా తోపాటు పలు దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాటిపై నాటో జీ7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా పిలుపునివ్వడంపై డ్రాగన్ కంట్రీ తీవ్రంగా స్పందించింది. కేవలం ఏకపక్షంగా వేధించేందుకు, ఆర్థిక బలప్రదర్శనకు అమెరికా ఇటువంటి చర్యలు చేపడుతోందని ఆరోపించింది. అమెరికా చెప్పినట్టు చేస్తే తాము ప్రతిచర్యలు చేపడతామని తీవ్ర హెచ్చరిక చేసింది. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో సోమవారం నుంచి రెండు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు మొదలైన వేళ చైనా నుంచి ఈ స్పందన రావడం గమనార్హం.



రోజువారీ సాధారణ ప్రెస్ బ్రీఫింగ్స్‌లో భాగంగా చైనా విదేశాంగశాఖ ప్రతినిధి లిన్ జిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ఇతర దేశాల వలె రష్యాతో కూడా తమకు సాధారణ సంబంధాలున్నాయన్నారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా అనుగుణంగానే ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికా చర్యలు ఏకపక్ష వేధింపులు, ఆర్థిక బలప్రదర్శనకు నిదర్శనమని మండిపడ్డారు. ఈ చర్యలు తీవ్ర స్థాయిలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను దెబ్బతీస్తాయన్నారు. ప్రపంచ వాణిజ్య, పారిశ్రామిక పంపిణీ వ్యవస్థలపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. భయపెట్టడం, ఒత్తిడి చేయడం లాంటివి సమస్యలను పరిష్కరించలేవని ఎప్పుడో నిరూపితమైందని లిన్‌జిన్ అన్నారు. ఉక్రెయిన్ విషయంలో చైనా విధానం ఎప్పుడూ ఒక్కటేనని, కేవలం చర్చలు, సంప్రదింపులతోనే ఆచరణయోగ్యమైన పరిష్కార మార్గం లభిస్తుందని పేర్కొన్నారు. ఏకపక్ష ఆంక్షలను చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఐరోపా, అమెరికా ఇప్పటికే రష్యాతో వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాయని గుర్తుచేశారు. చైనా, రష్యా సంస్థల మధ్య సహకారం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు.

## చట్టవిరుద్ధంగా ఉంటే..'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తాం



**ఇంటర్నెట్ డెస్క్:** బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల కమిషన్ అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే మొత్తం 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తామని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను హెచ్చరించింది. అయితే రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో సరైన నిబంధనలను పాటించిందని భావిస్తున్నట్లు పేర్కొంది. బిహార్‌లో ఈసీ చేపట్టిన ఓటరు జాబితా సర్వేకు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఈ విషయంపై తాము అసంపూర్తి అభిప్రాయాలు వెల్లడించలేమని..అక్టోబర్ 7న తుది వాదనలు విన్న తర్వాత తీర్పును వెలువరిస్తామని అత్యున్నత న్యాయస్తానం స్పష్టం చేసింది. బిహార్ సమగ్ర ప్రత్యేక సవరణలో ఆధార్‌ను కూడా కచ్చితంగా గుర్తింపు కార్డుగా పరిగణించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌కు మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ముందస్తు సూచనలు ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించడానికి నిరాకరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో న్యాయస్థానం ఎన్నికల కమిషన్ చూపిస్తున్న అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఆధార్ పౌరసత్వాన్ని నిరూపించలేకపోయినప్పటికీ.. అది ప్రజల గుర్తింపుకు చట్టబద్ధమైన రుజువుగా మిగిలిపోయిందని స్పష్టం చేసింది.

వంతారాకు ఆలయ ఏనుగులు.. అందులో తప్పేం లేదన్న సుప్రీంకోర్టు

కాగా బిహార్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట భాజపాతో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పటికే ఈ విషయంలో ఆధారాలను ప్రజలముందుకు తీసుకువచ్చామని..త్వరలో మరిన్ని ఆధారాలతో ఈసీ చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యలను బయటపెడతామని హెచ్చరించారు.

## హిందూమతంలో సమానత్వం ఉంటే వేరే మతంలోకి ఎందుకు మారుతారు..?



హిందువుల్లో కొందరు తమ మతాన్ని వదిలి మరో మతంలోకి మారుతుండటంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందూ మతంలో సమానత్వం ఉంటే మరో మతంలోకి మారడమనేది ఉండదని అన్నారు. సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'హిందూ మతంలో సమానత్వం ఉంటే ఎవరైనా ఎందుకు వేరే మతంలోకి మారతారు..?' అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. ప్రజలను మతం మారమని ఏ రాజకీయ పార్టీ కోరదని, అయినప్పటికీ మతమార్పిడులు జరుగుతున్నాయని అన్నారు. అది వారి హక్కు అని చెప్పారు. 'హిందూమతంలో సమానత్వమే ఉంటే అంటరానితనం ఇంకా ఎందుకు మిగిలి ఉంది..? అంటరానితనాన్ని మనం సృష్టించామా..? ఇస్లాం, క్రైస్తవం, ఇతర ఏ మతాల్లోనైనా అసమానత్వం ఉండొచ్చు. మేముకానీ బీజేపీకానీ ఎవరినీ మతం మారమని కోరం, ప్రజలే మతం మారుతుంటారు, అది వారి హక్కు కూడా' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. హిందువులను టార్గెట్ చేస్తూ కర్ణాటక సీఎం చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడ్డాయి. కులం, మతం పేరుతో ప్రజలను విభజించేందుకు సిద్ధరామయ్య ప్రయత్నిస్తున్నారని అసెంబ్లీలో విపక్ష నేత ఆర్ అశోక్ విమర్శించారు. అసమానత్వంపై ముస్లింలను సిద్ధరామయ్య ప్రశ్నించగలరా..? అని విమర్శించారు. దీనికిముందు బెంగళూరు శివాజీనగర్ మెట్రోస్టేషన్ పేరును సెయింట్ మేరీగా మార్చే ఒక ప్రతిపాదనకు సిద్ధరామయ్య ఆమోదం తెలిపారు. అది కూడా వివాదమైంది. సెయింట్ మేరి బాసిలికా వార్షిక కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధరామయ్య.. శివాజీనగర్ మెట్రో స్టేషన్ పేరును సెయింట్ మేరీగా మారుస్తామని ఆర్చిబిషప్ పీటర్ మచడోకు హామీ ఇచ్చారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనను కేంద్రానికి పంపుతామని చెప్పారు. దీన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. బుజ్జగింపు రాజకీయాల కోసం మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తోందని విమర్శించింది.

## దేశంలోని చొరబాటుదారులను వెనక్కి పంపుతాం



**పూర్ణియా:** దేశంలోని చొరబాటుదారులందర్నీ తమ ప్రభుత్వం వెనక్కి పంపుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రీయ జనతా దళ్ కాంగ్రెస్ పార్టీలు రెండూ బిహార్ ఐడెంటిటీని ప్రమాదంలో పడేస్తున్నాయని విమర్శించారు. ఆర్జేడీ-కాంగ్రెస్ హయాంలో బిహార్ ఇబ్బందుల పాలైందని అన్నారు. పూర్ణియాలో సోమవారం నాడు పలు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. బిహార్ అభివృద్ధిని చూసి కాంగ్రెస్, ఆర్జేడీ ఓర్వలేకున్నాయని, అందువల్లే అనవసరమైన అంశాలను లేవనెత్తుతున్నాయని ఎద్దేవా చేశారు. అయితే బిహార్ ప్రజలు, ముఖ్యంగా మహిళలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గట్టి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. 'ఈ రోజు సీమాంచల్, ఈస్టర్న్ ఇండియాలో డొమోగ్రాఫిక్ సంక్షోభం తలెత్తింది. బిహార్, బెంగాల్, అస్సాం, చాలా రాష్ట్రాలు తమ ఆడకూతుళ్లు, సోదరీమణుల భద్రతపై ఆందోళనగా ఉన్నాయి. అందుకోసమే ఎర్రకోట నుంచి నేను డెమోగ్రఫీ మిషన్‌ను ప్రకటించాను. కానీ ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్, ఆర్జేడీలు చొరబాటుదారులకు కొమ్ముకాస్తూ నిస్సిగ్గుగా నినాదాలు చేస్తున్నాయి. బయట దేశాల నుంచి వచ్చిన చొరబాటుదారులను కాపాడేందుకు యాత్రలు తీస్తున్నాయి' అని మోదీ విరుచుకుపడ్డారు. సొంత కుటుంబాల గురించి మాత్రమే ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తారని, తాము మాత్రం 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్'నే విశ్వసిస్తామని మోదీ చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా గణనీయంగా తగ్గిన జీఎస్టీ సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ప్రజల పొదుపు పట్ల తనకున్న చిత్తశుద్ధి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. జీఎస్టీ తగ్గింపుల కారణంగా వంటింటి ఖర్చులు చాలా వరకూ తగ్గుతాయని వివరించారు. టూత్‌పేస్ట్ నుంచి సబ్బులు, షాంపూలు, నెయ్యి, ఇతర ఆహార పదార్థాల ధరలు తగ్గుతాయని చెప్పారు. పేద ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

http://www.agnidharanews.com అగ్నిధార నిజాల నిప్పు కణిక

# కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే కాలేజీలు మూత

-మొదటిపేజీ తరువాయి

కోట్ల రూపాయలు చెల్లించలేరా? అంటూ ప్రశ్నించారు. నక్సలైట్లను ఎన్ కౌంటర్ చేయడంపైనా కేంద్ర మంత్రి తీవ్ర స్థాయిలో స్పందించారు. "దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం"అని స్పష్టం చేశారు. జాతీయ జెండా ఎగరనీయబోమని, ఎన్నికలే జరపనీయబోమని ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చర్యల్లేకపోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందని చెప్పారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ వద్ద ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే...ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంవల్ల రాష్ట్రంలోని 15 నుండి 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత పదేళ్లపాటు కేసీఆర్ ఫీజు రీయంబర్స్ మెంట్ ఇయ్యక తిప్పలు పెట్టారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కు బ్రాండ్ అంబాసిడర్ మేమేనని ఇన్నాళు సంకలు గుద్దుకున్న కాంగ్రెసోళ్లు 20 నెలలుగా ఆ బకాయిలియ్యకుండా మోసం చేస్తున్నరు. ? కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది? పంజాబ్ పోయి చెక్కులిచ్చి బౌన్స్ చేసి తెలంగాణ పరువును బజారున పడేస్తే.... ఈ కాంగ్రెసోళ్లు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నరే తప్ప పైసా ఇయ్యడం లేదు. కాంగ్రెస్ నమ్మిన పాపానికి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది. ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఆధారపడి ఈ రాష్ట్రంలో ఏటా 15 లక్షల మందికిపైగా పేద విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ వంటి ఉన్నత కోర్సులను చదువుకుంటున్నరు. నాలుగైదు ఏళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ పైసలు చెల్లించకపోతే వాళ్ల పరిస్థితి ఏంది? ఫీజు రీయంబర్స్ మెంట్ ఉందనే ఉద్దేశంతోనే ఉన్నత విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఇయాళ నడిరోడ్డున పడ్డరు. ఫీజుల కట్టకపోవడంవల్ల కాలేజీలు మెడపట్టి బయటకు నెట్టేస్తున్నయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నరు కదా?... పేద విద్యార్థుల కోసం రూ. 8 వేల కట్టలేరా? కాలేజీలు బంద్ అయితే విద్యార్థులు ఎటు పోవాలి? ఏం చదువుకోవాలి? వాళ్ల భవిష్యత్తును రోడ్డున పడేస్తారా? ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? కాలేజీ యాజమాన్యాలకు ఆనాడే చెప్పిన. కాంగ్రెస్ టోకెన్ల పేరుతో మోసం చేస్తదే తప్ప మీ గోడు పట్టించుకోదని. ఆనాడు చర్చలకు వెళ్లి వాళ్ల మాటలు నమ్మి కాలేజీ యాజమాన్యాలు మోసపోయాయి. కాలేజీ యాజమన్యాల్లో కొందరు కాంగ్రెస్ తొత్తులు ఉన్నందునే వాళ్లకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా. పేదోడు తెలంగాణలో బతకాలంటే భయమైతుంది. రోగమొస్తే కూడా పట్టించుకునే నాథుడే లేకపాయే... ఆరోగ్యశ్రీ పథకం కూడా మాదేనని జబ్బలు చర్చుకున్న కాంగ్రెసోళ్లు ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వకపోవడంతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రానీయ్యడం లేదు. ఆరోగ్యశ్రీ పైసలియ్యనిదే ఆసుపత్రుల్లోకి అడుగు పెట్టనిచ్చేదే లేదని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులోళ్లు తెగేసి చెబుతున్నరు. పోనీ సర్కారు దవాఖానాకైనా పోదామంటే సూది లేకపాయే, మందు బిళ్లలు కూడా లేకపాయే. మరి ఏం చేయాలే.... పేదోడికి రోగమొస్తే చావాల్సిందేనా? ఇందుకోసమేనా? కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించింది? ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ స్పందించవు. ఏమైనా అంటే కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం అంటూ రచ్చ చేస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నయ్. రైల్వే స్టేషన్ల అభివృద్ధి పేరుతో అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారంటూ కమ్యూనిస్టులు చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.... అభివృద్ధిపై కాకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నారు కాబట్టే కమ్యూనిస్టులు కాలగర్భంలో కలిసిపోయారు. అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం కాబట్టే 2 సీట్ల నుండి కేంద్రంలో వరుసగా 3 సార్లు అధికారంలోకి వచ్చినం. నక్సల్స్ ఎన్ కౌంటర్ పై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...నక్సల్స్ చంపింది ఎవరిని? పేదలు, ఆదివాసీ బిడ్డలనే కదా? మావోయిస్టులను సమర్ధించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిట్టెం నర్సిరెడ్డి, శ్రీపాదరావు, రాగ్యానాయక్ సహా ఎంతో మందిని నక్సల్స్ చంపారు. డ్యూటీ చేస్తున్న పోలీసులను కూడా నక్సల్స్ పొట్టనపెట్టుకుంటున్నారు కదా? పొట్ట కూటి కోసం డ్యూటీ చేస్తున్న వాళ్లను చంపితే మాట్లాడరా? చనిపోయినోళ్లంతా ప్రజలే కదా? తెలుగు వాళ్లే కదా?దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం. జాతీయ జెండా ఎగరనీయని, ఎన్నికలే జరపనీయని, ఆదివాసీ అమాయకబిడ్డలను చంపేటోళ్లను ఏమనాలి? ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పండి.పంచాయతీ ఎన్నికల జాప్యంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే దమ్ములేక రకరకాల సాకులు చెబుతోంది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్రమే. అయినా కేంద్రం ఏమీ ఇవ్వడం లేదని తిట్టడం సిగ్గు చేటు.రాష్ట్రంలో యూరియా కొరత, రైతుల కష్టాలపై స్పందిస్తూ...రబీ సీజన్ లో 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపితే... 2.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మిగిలింది. ఆ యూరియాను ఏం చేశారో చెప్పడం లేదు. పంపిణీ చేసిన యూరియాను ప్లాన్ ప్రకారం సరఫరా చేయడం లేదు. పైగా యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా పట్టించుకోరు. నిన్ననే మిర్యాలగూడలో ఎమ్మెల్యే గన్ మెన్ లారీ యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలించబోవడమే ఇందుకు నిదర్శనం. అసలు కాంగ్రెస్ కు ప్లానే లేదు. రబీ యూరియా వినియోగంపై లెక్కా పత్రం లేదు. ఇదేమని అడిగితే... కేంద్రాన్ని బదనాం చేయడమే పెట్టుకున్నరు. ఇకనైనా కేంద్రాన్ని బదనాం చేయడం పక్కనపెట్టి యూరియా విషయంలో రైతులు పడుతున్న బాధను అర్థం చేసుకుని ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని కోరుతున్నా.



# సిటీ అస్తవ్యస్తం

## ఇంటర్నెట్, కేబుల్, టెలిఫోన్ సేవలు తీవ్ర అంతరాయం

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో నెల రోజులుగా ఇంటర్నెట్, కేబుల్, టెలిఫోన్ సేవలు తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కొంటున్నాయి. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్స్‌ను అధికారులు కత్తిరించడంతో ఈ సమస్య తలెత్తింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వేలాడే తీగలను తొలగించాలనే ఉద్దేశంతో తీసుకున్న చర్యలు, ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల సచివాలయం వంటి కీలక సంస్థల నుంచి సామాన్య పౌరుల వరకు అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విద్యుత్ స్తంభాలపై సుమారు 2 వేల కిలోమీటర్ల పొడవైన ఇంటర్నెట్, కేబుల్ టీవీ, మరియు టెలిఫోన్ కేబుల్స్ ఉన్నాయి. ఈ కేబుల్స్ నగర జీవనానికి అత్యవసరమైనవి. అయితే, వేలాడే తీగలు వాహనాలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని, ఇటీవల రామాంతాపూర్‌లో జరిగిన ప్రమాదం వంటి సంఘటనలు జరుగుతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీని పరిష్కారంగా, కోర్టు ఆదేశాలతో అధికారులు కేబుల్స్‌ను తొలగిస్తున్నారు. కానీ, ఈ చర్యలు సమస్యను పరిష్కరించడానికి బదులు, సచివాలయం వంటి కీలక ప్రాంతాల్లో సేవల నిలిచిపోవడానికి దారితీశాయి. వర్క్ ఫ్రం హోం ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హైకోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలో అధికారులు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కేబుల్స్‌ను నిర్వహించే ఆపరేటర్లు లేదా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లపై చర్యలు తీసుకోవడానికి బదులు, అధికారులు కేబుల్స్‌ను నేరుగా



కత్తిరించడం ద్వారా ప్రజలకు సేవలను ఆపేస్తున్నారు. ఇది ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తోంది. టీవీ ప్రసారాలు నిలిచిపోవడం, ఫోన్ సేవలు అందుబాటులో లేకపోవడం, మరియు ఆన్‌లైన్ తరగతులకు అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ చర్యలు చిన్న వ్యాపారాలను మూతపడే పరిస్థితికి తీసుకొస్తున్నాయి.ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్ సేవలు నీటి, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాలుగా మారాయి. చట్టప్రకారం, బిల్లులు చెల్లించే ప్రజలకు ఈ సేవలు అందించడం సర్వీస్ ప్రొవైడర్ల బాధ్యత. అయితే, అధికారుల నిర్ణయాలు ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సుప్రీం కోర్టు కూడా ఇంటర్నెట్ సేవలను అంతరాయం కలిగించడం ప్రజల హక్కుల ఉల్లంఘనగా పరిగణించింది. అయినప్పటికీ, హైదరాబాద్‌లో ఈ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.ఈ సమస్యకు పరిష్కారంగా, అధికారులు కేబుల్ నిర్వాహకులు, సర్వీస్ ప్రొవైడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. వేలాడే తీగల సమస్యను పరిష్కరించడానికి కేబుల్స్‌ను సరిగ్గా నిర్వహించేలా నిబంధనలు అమలు చేయాలి, కానీ సేవలను నిలిపివేయడం సరైన పరిష్కారం కాదు. సమస్యకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం ద్వారా, ప్రజల ఇబ్బందులను తగ్గించవచ్చు. అలాగే, ఇంటర్నెట్ మరియు కేబుల్ సేవలను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

# సునీతమ్మకే టిక్కెట్

**హైదరాబాద్ :** త్వరలోనే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాబోతుంది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా సాగుతుండగా.. ఈ బైపోల్ తో మరో లెవల్ కి వెళ్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ సర్కార్ పై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని బీఆర్ఎస్ చెబుతుంటే? అలాంటి పరిస్థితే లేదంటోంది కాంగ్రెస్. ఇదే టైమ్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ లను టార్గెట్ చేస్తూ బీజేపీ నేతలు వాయిస్ పెంచుతున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎవరు పైచేయి సాధిస్తారనేది ఆసక్తికరంగా మారింది.అసెంబ్లీ ఎన్నికలో ఇక్కడ్నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ గెలిచారు. అనారోగ్యంతో ఆయన ఇటీవలే మృతి చెందటంతో ఇక్కడ ఉపఎన్నిక రానుంది. దీంతో ఈ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవటం బీఆర్ఎస్ సవాల్ అనే చెప్పొచ్చు. గతంలో కంటోన్మెంట్ లో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే మృతి చెందటంతో ఉపఎన్నిక జరిగింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారు. అయితే ఇక్కడ మాత్రం...అలా జరగకుండా పక్కాగా అడుగులు వేసే పనిలో పడింది బీఆర్ఎస్ నాయకత్వం.ఈ ఉపఎన్నిక కోసం ఎవర్నీ అభ్యర్థిగా నిలపాలనే విషయంపై బీఆర్ఎస్ బాగానే కసరత్తు చేసింది. పార్టీకి చెందిన పీజేఆర్ కుమారుడైన విష్ణువర్ధన్ రెడ్డితో పాటు రావుల శ్రీధర్ రెడ్డి పేర్లను పరిశీలించింది. అంతేకాకుండా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ పేరును కూడా పరిశీలించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇవన్నీ కాకుండా...మాగంటి గోపినాథ్ భార్య సునీతకే టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.తాజాగా తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్... మాగంటి గోపినాథ్ సతీమణి సునీతకు అండగా పార్టీ ఉంటుందన్నారు. ఆపదలో ఉన్నప్పుడు గోపీనాథ్ కుటుంబం నియోజకవర్గ ప్రజలను ఆదుకున్నదని... ఇప్పుడు ఆపదలో ఉన్న ఆయన కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందంటూ చెప్పుకొచ్చారు. కేటీఆర్ వ్యాఖ్యలతో దాదాపుగా ఆమెకే టికెట్ ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా త్వరలోనే పేరును ప్రకటించే అవకాశం ఉంది.ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోలింగ్? శాతం 47.49 నమోదైంది. ఈ నియోజకవర్గం నుంచి మాగంటి గోపీనాథ్ వరుసగా 3 పర్యాయాలు విజయం సాధించారు. 2023 ఎన్నికల్లో మాగంటి 80,549 ఓట్లు సాధించగా? సమీప కాంగ్రెస్ అభ్యర్థి అజాహరుద్దీన్?కు 64,212 ఓట్లు దక్కిన సంగతి తెలిసిందే.మరోవైపు ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం? జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,04,288 మంది పురుషులు కాగా?. 1,88,356 మంది మహిళలు ఉన్నారు. ఈ ముసాయి జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే సెప్టెంబర్ 17 వరకు అప్లికేషన్లు ఇవ్వొచ్చని సూచించింది.ఇక మార్పులు చేర్పులు మాత్రమే కాకుండా? కొత్తగా ఓటు నమోదు కూడా చేసుకునే వీలు ఉందని ఈసీ తెలిపింది. వచ్చిన అభ్యంతరాలను సెప్టెంబర్ 29వ తేదీ వరకు పరిశీలిస్తారు. సెప్టెంబర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఉపఎన్నిక కోసం 407 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

## టెండర్స్ పిలవండి..

-మొదటిపేజీ తరువాయి

సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు..

## కాంగ్రెస్ నేతల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్ మార్కెట్




రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 13 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సిఎం చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల ఫీజుల కోసం లేని డబ్బులు, కమిషన్లు, కాంట్రాక్టులకు మాత్రం ఎక్కడి నుంచి వస్తున్నాయో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించామన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు గత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ లో ఉంచిన మూడు వేల కోట్ల రూపాయలను కూడా చెల్లించామన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డబ్బులు లేవన్న సాకుతో పెండింగ్ బకాయిలను ఇవ్వడం లేదని విమర్శించారు. డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలకే ఖర్చు అవుతున్నాయి, రీ యింబర్స్ మెంట్ కు ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెప్పడం సిగ్గుచేటు అన్నారు.. కాలేజీల బంద్‌ను ఆపి వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న యూరియా కొరత, సంక్షోభానికి కాంగ్రెస్ పార్టీనే ప్రధాన కారణమన్నారు కేటీఆర్. రైతుల కోసం కేటాయించిన యూరియాను కాంగ్రెస్ నాయకులే బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మ్యాన్ ఒక లారీ లోడ్ యూరియాను ఎత్తుకుపోవడం రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల దోపిడికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఒక గన్ మ్యాన్ లారీ లోడ్ యూరియా ఎత్తుకుపోతే ఇక కాంగ్రెస్ నాయకులు, మంత్రులు ఎంత దోచుకుంటున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. గత ముఖ్యమంత్రులైన ఎన్టీఆర్,చంద్రబాబు, వైఎస్ఆర్, రోశయ్యలు ప్రవేశపెట్టిన కొన్ని పథకాలను కేసీఆర్ కొనసాగించారని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే కేసీఆర్ పేరు ఉందన్న ఏకైక కారణంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో మంచి పథకాలను నిలిపివేసిందని ఆరోపించారు. కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు అన్నింటినీ ఆపేశారని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ నాయకులు అందినకాడికి దోచుకుతింటున్నారని మండిపడ్డారు. అప్పులు చేయకుండా ఆదాయం పెంచి పాలన చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పుకున్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన 24 నెలల్లో ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి నిర్వాకంతో ఊర్లలో అత్తా, కోడళ్ల మధ్య కొత్త పంచాయతీలు మొదలైనయన్నారు. హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై ప్రేమ ఉంటే వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు మంత్రులు పోవాలి కాని ఉప ఎన్నికల ప్రచారంలో తిరగొద్దన్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని తెలంగాణలోని ప్రతీ ఒక్కరు కోరుకుంటున్నారన్న కేటీఆర్, గులాబీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోనే మొదలవ్వాలన్నారు. తెలంగాణ దివాలా తీసింది, ఎయిడ్స్ పేషెంట్, క్యాన్సర్ పేషెంట్ అంటూ రేవంత్ రెడ్డి రాష్ట్రం పరువు తీస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు.చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉన్న మాగంటి గోపీనాథ్ సేవలను గుర్తు చేసుకున్న కేటీఆర్, తామంతా కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పీజేఆర్, కేసీఆర్ పోరాట స్ఫూర్తితో బీఆర్ఎస్ కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే తమ ఇంటిని కూల్చివేసేందుకు పర్మిషన్ ఇచ్చినట్టే అన్న విషయాన్ని ప్రజలకు తెలియచేయాలని కార్యకర్తలకు సూచించారు. జీవో నెంబర్ 58, 59 కింద లక్ష మందికి కేసీఆర్ పట్టాలిచ్చారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేల మంది ఇళ్లను కూలగొట్టిందని కేటీఆర్ ఆరోపించారు.ఆరు గ్యారెంటీలు ఇవ్వకుండా మోసం చేసినందుకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గోస పెడుతున్నందుకు, హైదరాబాద్‌ను ఆగం చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి జూబ్లిహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ లో ఘన విజయం సాధించి మాగంటి గోపినాథ్ కు నివాళి అర్పించాలని కోరారు.

## నవంబర్‌లో లోకల్ ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి




నిర్ణయించిన సెప్టెంబర్ 30 గడువును పొడిగించాలని కోరుతూ ప్రభుత్వం వచ్చే వారం హైకోర్టును ఆశ్రయించడానికి ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల మీద కూడా క్లారిటీ రావాల్సి ఉంది.ఈ అంశంపై ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి ఉన్నాయి. కోటా అంశంపై స్పష్టత వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం కష్టమే. సెప్టెంబర్ చివరి నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని జూన్‌లో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే సెప్టెంబర్ నెల దాదాపు సగం వరకు వచ్చింది. దీంతో ప్రభుత్వం అధికారికంగా మరింత సమయం కోరాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో జాప్యం అనివార్యమన్నట్టుగా చెప్పారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ కోటాను అమలు చేయడానికి కాంగ్రెస్ దృఢంగా కట్టుబడి ఉందని మరోసారి చెప్పారు. రిజర్వేషన్ల సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం ఎన్నికలను కొనసాగించదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రాధాన్యత ఇస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. అక్టోబర్ ప్రారంభంలో భారత ఎన్నికల సంఘం బీహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందనే అభిప్రాయం ఉంది.అక్టోబర్ 2న దసరా తర్వాత వెంటనే జూబ్లీహిల్స్‌లో తన ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడానికి అన్ని వనరులను ఉపయోగించాలని కాంగ్రెస్ అనుకుంటోంది. బీఆర్ఎస్ నుంచి కైవసం చేసుకున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలాగా విజయాన్ని పునరావృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించి బీఆర్ఎస్ నుంచి సీటును కైవసం చేసుకోవడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బలంగా ఎన్నికలకు వెళ్లొచ్చని హస్తం పార్టీ భావిస్తోంది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో ప్రభావం పడుతుందని ప్లాన్ వేస్తోంది.

సంపాదకీయం

# అసహనం పరాకాష్ఠకు

'భారత రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం' ..నేపాల్ పరిణామాల నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చేసిన వ్యాఖ్య ఇది. రాజ్యాంగాన్ని చూసి మాత్రమే కాదు, అంతటి మహోన్నత రాజ్యాంగాన్ని రచించి మనకు అందించిన రాజ్యాంగ నిర్మాతలను చూసి కూడా గర్వించాలి కదా? భిన్న మతాలు, భిన్న జాతులతో కూడిన మన దేశం భిన్నత్వంలో ఏకత్వంతో అప్రతిహతంగా సాగిపోవడానికి వారు అందించిన రాజ్యాంగమే ప్రాతిపదిక కదా? రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థల అధిపతులు మంచివాళ్లు కాకపోతే పరిస్థితి ఏమిటి? శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాల తర్వాత మన దేశంలో కూడా ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందా? అన్న అనుమానం కొందరిలోనైనా ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో రాజ్యాంగం లోపభూయిష్టంగా ఉందని కాదు.. పాలకులు బాధ్యతారహితంగా, రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా వ్యవహరించడం వల్ల అవినీతి, అరాచకాలు పెచ్చరిల్లి ప్రజల్లో అసహనం పరాకాష్ఠకు చేరింది. ఫలితమే ప్రజాగ్రహం పెల్లుబికి పాలకులు దేశం విడిచి పారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ దుస్థితి వెనుక అమెరికా హస్తమో లేక మరొకరి హస్తమో ఉందని చెప్పుకోవచ్చు కానీ ప్రభుత్వాల పట్ల ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకొని ఉండకపోతే తిరుగుబాట్లు చోటుచేసుకోవు. మన పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌తో మన దేశాన్ని ఏ విధంగానూ పోల్చలేము. భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతుల కలబోతగా ఉన్న మన దేశంలో ప్రభుత్వాలపై ఈ రూపంలో తిరుగుబాట్లు అసాధ్యం. అలా జరగాలని కూడా కోరుకోకూడదు. మన ప్రజాస్వామ్య వ్యవస్థ అనేక పరీక్షలకు నిలబడి పరిపక్వత చెందింది. ప్రజలు కూడా ఎప్పటికప్పుడు విజ్ఞత ప్రదర్శించి హద్దులు మీరిన పాలకులకు ఎన్నికల సందర్భంగా బ్యాలెట్ ద్వారా కర్రు కాల్చి వాత పెడుతున్నారు. అయితే ఏ సందర్భంలో కూడా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజల తీర్పు ఒకే రకంగా ఉండకపోవడం మన విశిష్టత. ఉదాహరణకు, ఎమర్జెన్సీనే తీసుకుందాం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తన అధికారానికి ముప్పు ఏర్పడుతోందని గ్రహించి దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ఫలితంగా లభించిన అపరిమిత అధికారాలతో అధికార యంత్రాంగం ప్రజలను హింసించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించివేశారు. అయితే ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలలో ఎమర్జెన్సీ ప్రభావం తక్కువగా ఉండింది. ఈ కారణంగా ఉత్తరాదిలో తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్ పార్టీ దక్షిణాదిన కొంత మేరకు నిలదొక్కుకోగలిగింది. అత్యవసర పరిస్థితి నాటి దురాగతాలను కూడా ప్రజలు ఎన్నికల వరకు భరించి బ్యాలెట్ ద్వారా ఇందిరాగాంధీకి గుణపాఠం చెప్పారు. అంతేగానీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయలేదు. 1984లో తెలుగునాట చోటుచేసుకున్న అధికార దుర్వినియోగాన్నే తీసుకుందాం. మెజారిటీ శాసనసభ్యుల మద్దతు కలిగి ఉన్న ఎన్టీఆర్‌ను తొలగించి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ రాంలాల్ నియమించారు. ఇది కూడా నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రోద్బలంతోనే జరిగింది. ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్‌ను అన్యాయంగా, అక్రమంగా తొలగించడాన్ని జీర్ణించుకోలేని తెలుగు ప్రజలు శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకు ఆందోళన చేపట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఊపందుకోవడంతో గవర్నర్ రాంలాల్ తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఇందిరాగాంధీ దిగివచ్చి ఎన్టీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా నియమించడానికి అంగీకరించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఆ కారణంగా జరిగిన ఎన్నికల్లో కూడా తెలుగు ప్రజల ఆగ్రహం చల్లారలేదు. దేశవ్యాప్తంగా సానుభూతి పవనాలు వీచి కాంగ్రెస్ పార్టీకి ఎన్నడూ లేనంత స్థాయిలో మెజారిటీ లభించి, రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యారు. అయితే ఆ ఎన్నికల్లో తెలుగునాట మాత్రం ప్రజలు కాంగ్రెస్‌పై తమ కక్ష తీర్చుకున్నారు. అధికార దురహంకారంతో వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వాలపై మన ప్రజలు బ్యాలెట్‌ను బుల్లెట్‌లా ప్రయోగించారే గానీ, పొరుగు దేశాల్లో వలె విధ్వంస చర్యలకు పాల్పడలేదు. ఇందుకు మన సమాజాన్ని చూసి మనం గర్వించాలి. అయితే ప్రజలు మాత్రమే ఎల్లవేళలా విజ్ఞత ప్రదర్శించాలనుకోవడం అత్యాశే అవుతుంది. పాలకులపై ఆ బాధ్యత ఉండదా? ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలించాల్సిన బాధ్యత పాలకులపై ఉండదా? ఒక్కసారి అధికారంలోకి వస్తే ఐదేళ్లపాటు విర్రవీగుతూ అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడవచ్చా? అలా చేయడం ప్రజల సహనాన్ని పరీక్షించడం కాదా? రాజ్యాంగ పరిరక్షకులుగా ఉన్న ఆయా వ్యవస్థల అధిపతులపై కూడా బాధ్యత ఉంటుంది కదా? మన రాజ్యాంగ నిర్మాతలు ఆయా రాజ్యాంగ వ్యవస్థల మధ్య సున్నితమైన లక్ష్మణ రేఖలు గీశారు. ఒక వ్యవస్థ అధికార పరిధుల్లోకి మరో వ్యవస్థ చొరబడకుండా సరిహద్దులు నిర్ణయించారు. అయితే రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్నవారు బాధ్యతారహితంగా వ్యవహరించిన సందర్భాలలో ఆయా వ్యవస్థల మధ్య ఘర్షణ తలెత్తుతోంది. శాసనసభలో మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న నాయకుడే ముఖ్యమంత్రిగా నియమితులు కావాలని రాజ్యాంగం అభిప్రాయపడింది. అదే సమయంలో గవర్నర్లు ఎవరినైనా ముఖ్యమంత్రులుగా నియమించవచ్చునని అదే రాజ్యాంగంలో పేర్కొన్నారు. దీని ఉద్దేశం దారినపోయే దానయ్యను ముఖ్యమంత్రిని చేయమని కాదు. ముఖ్యమంత్రిగా నియమితుడయ్యే వ్యక్తి అప్పటికి చట్టసభల్లో సభ్యుడు కాకపోయినా సభలో మెజారిటీ నిరూపించుకొని ఆరు నెలల్లో ఏదో ఒక సభకు ఎన్నిక కావాలని రాజ్యాంగంలో నిర్దేశించారు. సదుద్దేశంతో కల్పించిన ఈ వెసులుబాటును రాంలాల్ వంటి వారు దుర్వినియోగం చేశారు. రాజ్యాంగ నిర్మాతల అభిమతాన్ని తప్పుగా అన్వయించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన సందర్భాలను ఎన్నో చూశాం. రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన బిల్లులను ఆమోదించే విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాల వ్యవధి ఉండాలా? వద్దా? అన్నది ప్రస్తుతం సర్వోన్నత న్యాయస్థానం విచారణ పరిధిలో ఉంది. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో రాష్ట్రపతి, గవర్నర్లు, న్యాయమూర్తులకు ప్రత్యేక రక్షణలు కల్పించడంతో పాటు విశేష అధికారాలూ కల్పించారు. అలా అని మా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తామని వారు భావిస్తే ప్రజల్లో అసహనం ఏర్పడదా? బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఏమిటని పాలకులు ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత సర్వోన్నత న్యాయస్థానం పైనే ఉంటుంది. పార్లమెంటు ఆమోదించే చట్టాలు సైతం రాజ్యాంగానికి లోబడి ఉన్నాయా లేవా అని సమీక్షించి నిర్ణయం తీసుకొనే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుంది కదా? శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదముద్ర వేయకుండా నెలలూ, సంవత్సరాల తరబడి పక్కన పడేస్తే ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాలు ఏమి చేయాలి? శాసనసభలు ఆమోదించిన బిల్లులు రాజ్యాంగానికి లోబడి లేని పక్షంలో ఆ విషయం చెప్పి తిరస్కరించవచ్చు. కానీ శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచడం, అదేమంటే మా అధికారాన్ని ప్రశ్నించి, మాకు గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఎక్కడిది? అని హుంకరించడం సమర్థనీయమా? గవర్నర్లు, రాష్ట్రపతి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి అవాంఛనీయ వివాదాలు తలెత్తవు కదా? మన దేశంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల విశ్వసనీయత కొంతకాలంగా మసకబారుతోంది.

# కిర్క్ హత్యలో కార్ల్ మార్క్స్ ప్రమేయం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మానసపుత్రుడైన చార్లీ కిర్క్ దారుణ హత్యకు గురయ్యాడు. ఉథా వ్యాలీ యూనివర్సిటీలో సెప్టెంబరు 11న నిర్వహించిన 'ద అమెరికన్ కమ్‌బ్యాక్ టూర్' కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా కిర్క్‌ను కాలేజీ విద్యార్థి ఒకడు తుపాకీతో కాల్చి చంపేశాడు. కిర్క్ 32 ఏళ్ల యువకుడు. అయితే ఛాందసుడు. కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు అనే బాపతు! అమెరికా కళాశాలల్లో అల్లరిమూకలు కాల్పులు జరిపిన వార్తలు తరచూ వింటుంటాం. ఇది అలాంటి హత్య కాదు. అమెరికన్లేగాక ఈ వార్త తెలిసిన వారంతా దీన్ని ఒకానొక హత్యా సంఘటనగా తేలిగ్గా తీసిపడేయడం లేదు. దాన్నొక భిన్న సైద్ధాంతిక శిబిరాల ఘర్షణగా చూస్తున్నారు. వివిధ దేశాలపై, వివిధ సమూహాలపై ట్రంప్ అనుసరిస్తున్న కక్షసాధింపు విధానాల మీద జరుగబోయే ప్రతిచర్యలకు ఇదొక మచ్చుతునక అంటున్నారు. ఇది ఇంతటితో ఆగదని కూడ కొందరు అంటున్నారు. చార్లీ కిర్క్ మీద కాల్పులు జరిపిన విద్యార్థిని పోలీసులు గుర్తించారు, అరెస్టు చేశారు. అతని పేరు టేలర్ రాబిన్‌సన్. 22 ఏళ్ల యువకుడు. హంతకుడ్ని చూసి ఉథా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ షాక్‌కు గురయ్యాడు. రాబిన్‌సన్ కుటుంబంతో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయి. మంచి కుటుంబంబీ మంచి అబ్బాయిబీ కానీ ఇంతలో ఇలా ఎలా రాడికల్‌గా మారిపోయాడు అంటూ ఆశ్చర్యపోయాడు. అమెరికాలో కూడా కమ్యూనిస్టు తీవ్రవాదుల్ని రాడికల్స్ అంటారు. చార్లీ కిర్క్ క్రైస్తవ మతవాదిబీ అతివాద జాతీయవాది. సులువుగా చెప్పుకోవాలంటే అమెరికాలో పురాతన అమెరికన్లు, సనాతన క్రైస్తవులు మాత్రమే ఉండాలని ప్రగాఢంగా నమ్మేవాడు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ "అమెరికాకు పూర్వ వైభవాన్ని పునరుద్ధరిద్దాం" అనే నినాదాన్ని ఇచ్చాడు. ఉదారవాదాన్ని తిరస్కరించడం, ప్రపంచీకరణను వ్యతిరేకించడం, అమెరికాకు వలసల్ని అడ్డుకోవడం, అన్నింటా అమెరికా ప్రయోజనాలే ముఖ్యం అనడం ఇందులో ముఖ్యమైన అంశాలు. రోనాల్డ్ రీగన్ 1980లలోనే ఇలాంటి నినాదాలు ఇచ్చాడు. అయితే, ట్రంప్ వాటికి మరింత పదునుపెట్టాడు. ట్రంప్ విధానాలను ఛార్లీ గట్టిగా అందిపుచ్చుకున్నాడు. వాటిని దేశమంతటా విస్తృతంగా ప్రచారం చేయడానికి 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' అనే సంస్థను నెలకొల్పాడు. 2020 నవంబరు నెలలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయాడు. అయినా ప్రెసిడెంట్ ఎలెక్ట్‌కు అధికారాన్ని అప్పచెప్పి గద్దె దిగడానికి ట్రంప్ ఒప్పుకోలేదు. 2021 జనవరి 6న వాషింగ్టన్ డీసీలో తన అనుచరులైన అల్లరిమూకలతో ఒక కపట దాడిని నిర్వహించాడు. ఆ అల్లర్లలో కిర్క్ కీలక పాత్ర పోషించి ట్రంప్‌కు మరింత దగ్గర అయ్యాడు. ట్రంప్ రెండోసారి శ్వేతభవన నివాసి కావడంతో కిర్క్ మరింత రెచ్చిపోయాడు. చార్లీకి ఉదారవాదం అస్సలు పడదు. ఒక్కసారి అందులో పడితే కొట్టుకుపోతాం అనేది అతని ప్రగాఢ నమ్మకం. ఉదారవాదం అంటే ఇతర మతాలను, ఇతర దేవుళ్ళను గౌరవించాలి. మహిళల్ని ఆదరించాలి. అతనికి గర్భస్రావం, విడాకులు కూడా నచ్చవు.




ఎల్‌జీబీటీ క్యూ హక్కులు అస్సలు నచ్చవు. ఉదారవాదాలకు మూలం కార్ల్ మార్క్స్ అని అతని అక్కసు. తన ప్రత్యర్థుల్ని 'సాంస్కృతిక మార్క్సిస్టులు' అని తిట్టేవాడు. ఇదో విచిత్ర పదబంధం. మార్క్సిజం ఆర్థిక మూలాలను మాత్రమే పట్టించుకుంటుంది గానీ సాంస్కృతిక అంశాలను పట్టించుకోదని మన దేశంలో నయా అంబేద్కరిస్టులు కొందరు విమర్శిస్తుంటారు. కిర్క్ మార్క్సిజాన్ని ఒక పెద్ద ఉపద్రవంగా పరిగణించేవాడు. ఒకసారి మార్క్సిజం వలలో పడితే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలన్నింటిలోనూ రాజీపడాల్సి వస్తుందని అతను భావించేవాడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా బలపడాలంటే ఫాసిజం, నాజీజం వంటి సిద్ధాంతాలను పునరుద్ధరించాల్సిందే అని నమ్మేవాడు. 'సాంస్కృతిక బోల్షివిక్కు' అనే మాటను హిట్లర్ కాలపు జర్మనీలో ఒక తిట్టుగా వాడేవారు. ఇప్పుడు అమెరికాలో ట్రంప్ అనుయాయులు తమ ప్రత్యర్థుల మీద ఇదే మాటను ప్రయోగిస్తున్నారు. ట్రంప్ బలహీనపడుతున్న దశలో చార్లీ కిర్క్ చెలరేగిపోతుండడం చాలా మందికి చికాకు తెప్పించింది. ఆ మేరకు అమెరికా యువతరంలో అతని మీద ఏవగింపు కూడా పెరుగుతూ వచ్చింది. రాబిన్‌సన్ చాలాకాలంగా కిర్క్ కదలికల్ని గమనిస్తున్నట్టు విచారణలో తేలింది. కిర్క్ సనాతన భావాల్ని అతను అసహ్యించుకునేవాడట. అతన్ని 'ఫాసిస్టు' అనేవాడట. ట్రంప్ కన్నా ముందు వీడి ఆట కట్టించాలి అనే భావంతో ఉండేవాడట. కిర్క్ హత్యకు వాడిన తుపాకీతో పాటు కొన్ని బుల్లెట్లను కూడ రాబిన్‌సన్ నుంచి ఫెడరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక బుల్లెట్ కేసింగ్ మీద 'రేయ్ ఫాసిస్ట్! అందుకో' అని రాసి ఉంది. ఇంకో కేసింగ్ మీద 'బెల్లా సియావో' అని రాసి ఉంది. ముస్సోలిని ఫాసిస్టు పాలన రోజుల్లో అతనికి వ్యతిరేకంగా బాధితులు పాడుకున్న ఇటాలియన్ పాట పల్లవి అది. అంటే ఛార్లీ కిర్క్‌ను రాబిన్‌సన్ ఎంతగా అధ్యయనం చేశాడో అతని మీద ఎంతగా కసితో రగిలిపోయాడో అర్థం అవుతోంది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఇటలీలో ఫాసిజాన్నీ, జర్మనీలో నాజీజాన్నీ కార్ల్ మార్క్స్ అభిమానులు అంతం చేశారు. ఇప్పుడు అమెరికా ఫాసిస్టుల మీద కూడా సాంస్కృతిక మార్క్సిస్టులే తిరగబడుతున్నారు మరి.

# చైనా కండబల ప్రదర్శన

రెండో ప్రపంచ యుద్ధంలోనూ, జపాన్ దురాక్రమణను ప్రతిఘటించటంలోనూ విజయం సాధించి ఎనిమిది దశాబ్దాలవుతున్న సందర్భంగా బుధవారం తియనాన్మెన్ స్క్వేర్‌లో నిర్వహించిన సైనిక పరేడ్‌లో చైనా తన రక్షణ పాటవాన్ని ప్రదర్శించటం కన్నా బలప్రదర్శనకు ప్రాధాన్యమిచ్చింది. వ్యూహాత్మక అణ్వస్త్రాలు తన దగ్గరున్నాయని, ఇక రాబోయేదంతా తన యుగమేనని చాటదల్చుకున్నట్టుంది. 1949లో ప్రజా రిపబ్లిక్‌గా ఏర్పడింది మొదలు ఆ దేశం పదేళ్లపాటు ఏటా ఇలాంటి ఆర్భాటాన్ని ప్రదర్శించేది. ఎందుకో ఆ తర్వాత ఆపి, తిరిగి 1984లో పునరుద్ధరించింది. ప్రస్తుత అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆ పరేడ్‌ను విక్టరీ డే ఉత్సవంగా మార్చారు. ఈ తరహా పరేడ్‌లకు విదేశీ అతిథుల్ని పిలవటం అందరూ పాటించే ఆనవాయితీ. అయితే చైనా ఒక్కసారి 1959లో మాత్రమే దాన్ని పాటించింది. మళ్లీ అరవై ఆరేళ్ల తర్వాత ఇన్నాళ్లకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ పాల్గొన్నారు. వారిద్దరే కాదు... చైనా సన్నిహితులుగా ముద్రపడిన ఇరాన్, పాకిస్తాన్ తదితర దేశాల నుంచి కూడా అధినేతలు హాజరయ్యారు. ఈ పరేడ్‌ల సంప్రదాయం ఎవరు మొదలెట్టారోగానీ ఇందులో ప్రదర్శించేవన్నీ మారణాయుధాలు. ఈసారి పరేడ్‌లో చైనా వంద రకాల మారణాయుధాలను ప్రదర్శించింది. యుద్ధతంత్రాన్ని సమూలంగా మార్చగల ఆయుధాలే అందులో ఎక్కువ. సంప్ర దాయ యుద్ధంలోనూ, కొత్త తరహా యుద్ధంలోనూ తమ దరిదాపుల్లోకి రాగలవారెవరూ లేరని చైనా చెప్పదల్చుకున్నట్టు స్పష్టంగా కనబడుతోంది. పొరుగునున్న తైవాన్ దురాక్రమణకు ఇదొక రిహార్సల్ కావొచ్చన్న అనుమానాలు అందరిలో ఉన్నాయి. తైవాన్ జోలికెళ్తే అమెరికా దాడికొస్తుందన్న సంశయం చైనాకుండేది. కానీ ఉక్రెయిన్‌పై కత్తిగట్టిన పుతిన్ ముందు అమెరికా, పాశ్చాత్య దేశాలు నిస్సహాయులుగా మిగిలిన వైనం చూశాక తానూ తైవాన్‌లో ఆ మాదిరి ప్రయత్నం చేయొచ్చని చైనా భావిస్తూండవచ్చు. ఈ పరేడ్ ద్వారా చైనా దాన్నే చెప్పదల్చుకుందా? పరేడ్‌లు చూసి తమ దేశం శక్తిమంతంగా తయారైందని, శత్రువులు వణుకు తున్నారని సంబరాలు చేసుకునేవారు అన్ని దేశాల్లోనూ కనబడతారు. కానీ క్షణాల్లో భూమండలాన్ని భస్మీపటలం చేయగల శక్తి తమకున్నదని చాటుకోవటంలో ఉండే ఆనందమేమిటో సామాన్యులకు అర్థం కాదు. అణ్వస్త్రాన్ని మొదటగా ఉపయోగించబోమని చైనా మొదటినుంచీ చెబుతోంది. కానీ అది ప్రదర్శించిన అణు జలాంతర్గామి తీరు చూస్తుంటే ఆత్మరక్షణ కాదు... ఎదురుదాడికి చైనా సంసిద్ధమైందన్న అభిప్రాయం




కలుగుతుంది. చడీచప్పుడూ లేకుండా, అమెరికా గూఢచర్యానికి దొరకకుండా ఏ ఖండంలోని సాగర జలాల్లోనైనా దాన్ని మోహరించ వచ్చంటున్నారు. నీటి అట్టడుగున ఎంత దూరమైనా దూసుకెళ్లగల డ్రోన్లు, 2000 కిలోమీటర్ల శ్రేణిలోని విమాన వాహక నౌకలను ధ్వంసం చేయగల వైజె%-%21 హైపర్‌సోనిక్ క్షిపణి వగైరాలను పరేడ్‌లో ప్రదర్శించింది. శబ్దవేగం కన్నా పదిరెట్ల వేగం దీని సొంతం. ఉత్తర కొరియా నుంచి దక్షిణ కొరియాకు ముప్పు ముంచుకురాగలదన్న అనుమానంతో అమెరికా అతి జాగ్రత్తలు తీసుకునేది. ఇకపై దానికి జపాన్ రక్షణ బాధ్యత అదనం. ఇప్పటికే జపాన్ తీరం పొడవునా టైఫూన్, తోమహాక్, ఎస్‌ఎం-6 క్షిపణుల్ని మోహరించింది. ప్రపంచం గుర్తుపట్టలేనంతగా మారిపోతోంది. జరుగుతున్న పరిణామాలన్నీ ఉద్రిక్తతలను మరిన్ని రెట్లు పెంచేవే. చైనా పరేడ్ కూడా అటువంటిదే. ప్రపంచశాంతికి దోహదపడతామని ఒకపక్క చెబుతూ కండబలాన్ని ప్రదర్శించటం సరికాదన్న స్పృహ కూడా ఆ దేశానికి లేకపోయింది. ఆహ్వానించిన షీ జిన్‌పింగ్ తోపాటు అతిథులుగా వచ్చిన పుతిన్, కిమ్‌లు కూడా నియంత లక్షణాలు పుణికిపుచ్చుకున్నవారు. ఎన్నికలు లేకుండానో... బూటకపు ఎన్నికల ద్వారానో అధికారంలోకొచ్చినవారు. వీరికి జనమన్నా, వారి భద్రతన్నా ఏం పట్టింపు ఉంటుంది? సుంకాల యుద్ధంలో తలమునకలై అన్నిటినీ గాలికొదిలిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... జిన్‌పింగ్, పుతిన్‌లు ఉమ్మడిగా అమెరికాపై కుట్ర సాగిస్తున్నారని ఆరోపించారు. కనుక రాగల రోజుల్లో అమెరికా కండబల ప్రదర్శన అందరూ చూడాల్సి రావొచ్చు.

# సోమిరెడ్డికి కన్నీటి నివాళి

**నివాళులు అర్పించిన చిన్నంబావి మండల ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది.**



**అగ్ని ధార న్యూస్ చిన్నంబావి మండలం.** చిన్నంబావి మండల ఎంపీడీవో కార్యాలయంలో ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ సోమిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి కన్నీటి నివాళులు ఎంపీడీవో రామస్వామి కార్యాలయ సిబ్బంది. ఈ సందర్భంగా ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ ఈశ్వర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఎంపీడీవో ఆఫీసులోని ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న సోమిరెడ్డి విధులు నిర్వహిస్తున్నాడు. గత రెండు నెలలుగా జీతాలు లేక కుటుంబ అర్థిక పరిస్థితులు, బాగు లేక ఈరోజు సోమిరెడ్డి చనిపోవడం ఎంతో బాధాకరమని ఈ సందర్భంగా అన్నారు. ప్రభుత్వాలు నెల నెల చాలి చాలని జీతాలకు పనిచేస్తున్న చిన్న ఉద్యోగస్తులు దృష్టిలో పెట్టుకొని ప్రతి నెల జీతం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి కోరుతున్నామని తెలియజేశారు. ప్రతి నెల, నెల సరి వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాము, యధా విధిగా ప్రతి నెల జీతం వచ్చేది అయి ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండేది కాకపోవచ్చు అని సందర్భంగా అన్నారు. కుటుంబంలో పూట గడవక పూట గడవని పరిస్థితి ఏమి చేయాలో అర్థం కాక ఈ పని తప్ప వేరే పని చేసుకోలేక కుటుంబాన్ని సాకలేకపోతున్నాము అని ఈ సందర్భంగా అన్నారు. సాలిసాలని జీతాలతో, నెలలు నెలలు గడుస్తున్న జీతం రాకపోవడం. వేరే పని చేసుకునే పరిస్థితి లేక దుర్భారమైన జీవితంలో గడుపుతున్నామని అన్నారు. సోమిరెడ్డి ప్రతిరోజు లాగే విధుల్లోకి వెళ్లి 4:30 నిమిషాలకు నలగొండలో జన్మభూమి రైలు కింద పడి సూసైడ్ చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎంతో ఆవేదనకు గురయ్యారు. ఈరోజు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ సోమిరెడ్డి మా మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మీ మీరు మా మధ్య లేకపోయినా మీ కుటుంబానికి మేము అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎంపీడీవో రామస్వామి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ సెక్రెటరీ శ్రీనివాసులు. ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ ఈశ్వర్, నరేష్, కార్యాలయ సిబ్బంది తెలియజేస్తున్నాము అని అన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల మహాధర్నా

## చిన్నంబావి తహసిల్దార్ కార్యాలయం ముట్టడి

### ఎమ్మార్పీఎస్ చిన్నంబావి మండల అధ్యక్షులు దేవని రమేష్ మాదిగ

### మాదాసి.మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కురువ చిన్న మల్లయ్య




**అగ్నిధార న్యూస్ చిన్నంబావి మండలం.** చిన్నంబావి మండల కేంద్రంలోని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం చిన్నంబావి మండల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దేవని రమేష్ ఆధ్వర్యంలో చిన్నంబావి మండల కేంద్రంలోని వాల్మీకి చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, వివిధ గ్రామాల అధ్యక్షులు, కమిటీల సభ్యులు, వికలాంగులు, చేయూత పెన్షన్ దార్ల మహాధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. చిన్నంబావి మండల అధ్యక్షులు దేవని రమేష్ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వెంటనే వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000కి, చేయూత పెన్షన్‌ను రూ.4,000కి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాదాసి / మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కురువ చిన్న మల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదు. 22 నెలలు గడిచినా పెన్షన్లు పెంచకపోవడం మోసపూరిత వైఖరి అని మండిపడ్డారు. పెన్షన్ దారుల ఆశలతో ఆటలు ఆడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే వికలాంగుల పెన్షన్లు మరియు చేయుట పెన్షన్లు పెంచే విధంగా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వడ్డేమాన్ రామకృష్ణ మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, గీత కార్మికులు, ఎన్నికల్లో హామీ ఇచ్చిన పెన్షన్ను తక్షణమే అమలు పరచాలని డిమాండ్ చేశారు. క్షీణతతో బాధపడుతున్నవారందరికీ కనీసం రూ.15,000 పెన్షన్ ఇవ్వాలి. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వికలాంగుల పెన్షన్ లు పెంచుతామని స్పష్టంగా చెప్పింది. కానీ ప్రభుత్వం వాగ్దానాలను మోసం చేస్తోంది అని ఆయన విమర్శించారు. తదనంతరం చిన్నంబావి మండల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తహసీల్దార్ శ్రీనివాసులు కు వినతిపత్రం అందజేశారు. పెన్షన్ దారుల సమస్యను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పెన్షన్లు పెంచాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు తగరం కాన్షిరం మాదిగ, వడ్డేమాన్ రామకృష్ణ మాదిగ, చారకొండ బాబు మాదిగ, కత్తి జాని మాదిగ, సులిగిరి శ్రీనివాసులు మాదిగ, తగరం గోపాల్ మాదిగ, బోరెల్లి జయరాములు మాదిగ, శ్రీనివాసులు మాదిగ, కేతపాగ స్వాములయ్య, వెంకట చారి, హుస్సేన్ రెడ్డి, సుధాకర్ గౌడ్, లక్ష్మి పద్మమ్మ, కృష్ణయ్య, పల్లె మద్దిలేటి, కొమ్ములయ్య, బాలకృష్ణ తెలుగు, మద్దిలేటి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉద్యమం, రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెన్షన్లను పెంచకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని నేతలు హెచ్చరించారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

**సిపిఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు**




**అగ్ని ధార న్యూస్ ( కల్వకుర్తి)** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి, ప్రజల మధ్య చీలికలు తెస్తున్న బీజేపీ విధానాలను తిప్పి కొడతామని సీపీఐ కల్వకుర్తి నియోజకవర్గం ఇంచార్జి పులిజాల పరశురాములు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్ నగర్ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సంస్థానంలో వెట్టిచాకిరీ, భావ వ్యక్తికరణపై అంక్షలు, తెలుగు భాషపై అణచివేత, నిరంకుశ ధోరణులు కొనసాగాయని తెలిపారు. తెలుగు భాషా సంస్కృతులను రక్షించేందుకు ఏర్పాటైన ఆంధ్ర మహాసభ నిజాం నవాబ్ అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసిందన్నారు. 1946 నుంచి 1951 వరకు రైతులు, ప్రజలు నైజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన ఈ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమి ప్రజలకు పంచినట్టు తెలిపారు. మూడు వేల గ్రామాలు విముక్తి అయ్యాయని, నాలుగు వేల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఏనాడు పాల్గొనని బీజేపీ చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. నిజాం, భూస్వాములు, జాగీర్దార్లు, జమీందార్లు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం ప్రజలు విరోచతంగా పోరాడారని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల ప్రజాస్వామిక హక్కులనుకాలరాస్తుందన్నారు. హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై నిర్భంధాలను ప్రయోగిస్తుందని,రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మార్చేందుకు కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు కట్టబెట్టాలనే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాలూకా సహాయ కార్యదర్శి దార దాసు సిపిఐ మండల నాయకులు నేరటి రాజు, బాలయ్య, శ్రీరాములు, అంకూరి పరశురాములు, శివ, రామస్వామి. నరసింహ, తదితరులు పాల్గొన్నారు,

## కాటమయ్య దేవాలయ నిర్మాణంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉంది

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల మండలం నల్లవారి పల్లి, అవురు పల్లి గ్రామాల సరిహద్దులో నూతనంగా నిర్మిస్తున్న కాటమయ్య గుడి నిర్మాణంలో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తన సొంత నిధుల ద్వారా గత కొన్ని రోజుల క్రితం బోరుబావిని తవ్వించగా సోమవారం ఆయన బోరు మోటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామ దేవతల ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై మన సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు వై వెంకటేశ్వర్లు గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బాలగోని రవి గౌడ్, వైస్ చైర్మన్ గజ్జ కృష్ణయ్య గౌడ్, గౌడ సంఘం నాయకులు కేశ మౌని శ్రీనివాస్ గౌడ్, గౌని నరసింహ్మ గౌడ్, వెంకటయ్య గౌడ్, హరి మోహన్ గౌడ్, బాలగోని కృష్ణయ్య గౌడ్, కాటం గౌడ్, గణేష్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కాట్ల యాదయ్య గౌడ్, సత్తయ్య గౌడ్ గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వరం సీఎం సహాయ నిధి

**పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..**
**రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ గ్రామ పంచాయతీకి చెందిన జంగిలి సునీత కు మంజూరైన రూ.17 వేల చెక్కు ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి వెల్దండలోని కార్యాలయంలో జంగిలి ఆనంద్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పథకాన్ని సద్వినియోగ చేసుకోవాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు శేఖర్, నాగులు నాయక్,మాజీ ఎంపిటిసి జ్యోతి నిరంజన్, మాజీ ఉపసర్పంచ్లు జంగిలి నిరంజన్, నరసింహ, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్ రెడ్డి ,జోగయ్య, ఈడుదులపల్లి శ్రీనివాస్, జోగు రవి, ఎంఎస్ గౌడ్ , భీమయ్య గౌడ్, రమేష్ రాజు, వెంకట్ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొప్పు సాయిలు మృతి చెందారు విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ శాసన సభ్యులు జైపాల్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 రూపాయలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, కో ఆప్షన్ సభ్యులు రుక్ముద్దీన్, నాయకులు దేవయ్య, రత్నం, పరుష రాములు, మాణిక్యం, కృష్ణ ,పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి పుల్లయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి 3000 రూపాయలు, గౌరీ జువెలర్స్ ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మరియు ఆర్ఎన్ఆర్ డెవలపర్స్ ఏమిరెడ్డి పాండురంగారెడ్డి వాళ్ళ తల్లిదండ్రులు కీర్తిశేషులు ఏమి రెడ్డి సుదర్శనమ్మ-అల్వాల్ రెడ్డి మరియు ఏమి రెడ్డి భారతమ్మ-మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఒక్కొక్కరు 2500రూపాయల చొప్పున 5000 రూపాయలు మరియు మరియు స్థానిక మాజీ సర్పంచ్ దాసరి కిష్టమ్మ 1000 రూపాయలు మొత్తం 9000 రూపాయలను మృతుడి భార్య రామేశ్వరమ్మ కు అందించడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక మాజీ ఎంపిటిసి దాసరి యాదయ్య, మాజీ ఉప్ప సర్పంచ్ జక్కు శ్రీనివాస్ రెడ్డి, కడారి యాదయ్య, కడారి పర్వతాలు, కన్వెన్షన్ కాలూరి రామచంద్రయ్య, మృతుడి కుమారులు రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## స్పైస్‌జెట్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపుల్లో ఆలస్యం..!

ప్రముఖ చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తన ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలో మరోసారి జాప్యం చేస్తోంది. రూ.55,000 వరకు వేతనం కలిగిన జూనియర్ ఉద్యోగులు ఆగస్టు నెలకు సంబంధించి జీతం టైమ్‌కు అందుకోగా.. సీరియర్ సిబ్బంది ఆలస్యంగా జీతాలు అందుకుంటున్నట్లు సమాచారం. కొందరికీ ఇప్పటికీ జీతాలు అందలేదని తెలిసింది. సీనియర్ సిబ్బంది ముఖ్యంగా అసిస్టెంట్ మేనేజర్ స్థాయి, అంతకంటే ఎక్కువ స్థాయిలో ఉన్న వారికి కనీసం 10-15 రోజులు ఆలస్యంగా వేతనాలు అందుతున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై సంస్థ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. గత ఆర్థిక సంవత్సరం స్పైస్‌జెట్ వార్షిక నివేదిక ప్రకారం, సంస్థలో 4,894 మంది శాశ్వత సిబ్బందితో సహా మొత్తం 6,484 మంది ఉద్యోగులు ఉన్నారు. కాగా, గతంలో ఈ సంస్థ అనేకసార్లు తమ ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేసినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

# నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

**దేవాలయ అభివృద్ధికి 2,20,000 రెండు లక్షల ఇరవై వేల రూపాయల సహకారం**

**ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న**

**టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం కొట్ర గ్రామంలో నూతనంగా విగ్రహ ప్రతిష్టాపన పూర్తి చేసుకున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవాలయాన్ని సందర్శించి దేవాల కమిటీ వారు ఏర్పాటు చేసిన 41వ రోజు పూజా కార్యక్రమంలో పాల్గొని,స్వామి వారి దర్శనం చేసుకొని,తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది, అనంతరం ఆలయ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు రెండవ విడతగా రూ.ఒక లక్ష చెక్కు ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధితో పాటు దేవాలయాల అభివృద్ధి కూడా ప్రజలలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకువస్తుందనీ,గ్రామ దేవాలయాలు సాంప్రదాయాలకు ప్రతీకలని,వాటి అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని,శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవాలయ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు గత పర్యటనలో మొదటి విడతగా ఆలయానికి గ్రిల్స్ నిర్మాణానికి రూ.1,20,000 ఒక లక్షా ఇరవై వేలు సహకారంతో పాటుగా నిర్మాణం పూర్తయి విగ్రహ ప్రతిష్టాపన జరిగిన శుభ సందర్భంగా 1,00,000 ఒక లక్ష రూపాయలు చెక్కు అందిచడం జరిగిందని, దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని తెలియజేశారు. గ్రామస్తులు, దేవాలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ.శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవాలయ అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో ఇచ్చిన హామీ మేరకు రెండు విడతలుగా రూ.2,20,000 సహకారం అందించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ఎల్లపుడు శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండాలని,వారితో మేము కూడా ఎల్లవేళలా రుణపడిఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో.మాజీ ఎంపీటీసీ రాములు, ఆలయ కమిటీ సభ్యులు శ్యాంపూరి అల్లాజీ, లక్షమయ్య, మల్లయ్య, బాలచెంద్రయ్య,మొగులయ్య, ఆంజనేయులు చెన్నయ్య, కాషాయ్య, జంగయ్య లతో గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ముందే ముసుగు తొలగిస్తారా..?

**భారత రాజ్యాంగ నిర్మాత ను అవమానించిన వారిపై కేసులు నమోదు చేయాలి**

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ డిమాండ్**

**పెంచికల్ పేట లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తో కలిసి అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ**

**అగ్నిధార న్యూస్, కమాన్ పూర్ :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పెంచికల్ పేట లో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణకు ముందే దొంగలు, బందిపోటుల్ల వచ్చి రాత్రికి రాత్రి ముసుగుదీసి దండాలు వేసి అవమానించిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి అవమానం చేసేలా వ్యవహరించిన తీరు చాలా బాధాకరమన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పుణ్యఫలంగా అన్ని వర్గాల వారికి రాజ్యాంగ హక్కులు లభించాయని అలాంటిమహనీయుడి విగ్రహ ఏర్పాటుకు అధికార బలముతో అవమానం చేసేలా తన అనుచర గనంతో వ్యవహరింపు తీరు సభ్య సమాజం సిగ్గుచేటుగా భావిస్తుందని మండిపడ్డారు. కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట్ గ్రామంలో సోమవారం పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్, దళిత సంఘం నాయకుడు ఇరుగురాల కిష్టయ్య ల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తో కలిసి పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ వేదికపై ఆయన మాట్లాడారు. జాతి నిర్మాణంలో.. సామాజిక చైతన్యంలో.. మహత్తర కార్యక్రమాల్లో.. విప్లవాత్మకమైన రచనల్లో.. ఇలా ఎన్నో సామాజిక సమాజపరంగా మేలు చేసే కార్యక్రమాలు చేపట్టిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రతి సందర్భంలో అవంతరాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇకపై మరో మారు మహనీయుల విగ్రహాల ఏర్పాటులో అవంతరాలు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని ఇప్పటికే ప్రజలు నిర్ధారించుకున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మంథని నియోజకవర్గంలోని శ్రీపాద రావు విగ్రహాల స్థానాల్లో మహనీయుడు అంబేద్కర్ విగ్రహాలు నెలకొల్పి తీరుతామని హెచ్చరించారు. కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట్ గ్రామంలో రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చేయడానికి నీ అనుచరుగనముతో అధికార బలముతో ఎంతో ఇబ్బందులకు గురిచేయడం అహంకార పూర్వానికి నిదర్శనం అన్నారు. మంథని నియోజకవర్గంలో మీ తండ్రి విగ్రహాల వద్దకు వెళ్లి ముసుగు తీసేవారు ఎవరైనా ఉన్నారా..? అని ప్రశ్నించారు. కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట గ్రామంలో విగ్రహ ఏర్పాటులో ఇలాంటి బాధ్యత లేని చిల్లర మూకలు నిన్న రాత్రి అక్రమంగా ముసుగు తొలగించి దండలు వేసి విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు ప్రచారం చేసుకున్న ఆ దుండగులపై రాజ్యాంగం,చట్టంతో పని చేస్తున్న పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి రాజ్యాంగ పరిరక్షణకు తాము బద్దులమైనదని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికారంలో ఉన్న నాయకులకు అడుగులకు మడుగులోత్తుతే.. ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెంచికల్ పేట్ గ్రామ మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ శంకర్, వివిధ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడిపల్లి రోడ్డు వెడల్పును 70 ఫీట్లకు కుదించినందుకు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు

**కాంగ్రెస్ పార్టీ నాయకులు దీటి బాలరాజు రెండవ డివిజన్ మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి**



**అగ్నిధార న్యూస్,( రామగుండం) ,** అన్నపూర్ణ కాలనీ నుండి భరత్ నగర్ బోర్డు వరకు రోడ్డు వెడల్పును 70 ఫీట్లకు కుదిస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నిర్ణయం తీసుకున్నారని అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు దీటి బాలరాజు , రెండవ డివిజన్ మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి లు అన్నారు. ఈ మేరకు సోమవారంరోజున వారు ఆర్యవైశ్య సంఘం నాయకులు, స్థానిక వ్యాపారులు సమావేశంమై 80 ఫీట్ల రోడ్డును 70 ఫీట్లకు కుదిస్తూ ఎమ్మెల్యే నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి, ఎన్టిపిసి ఆర్యవైశ్య సంఘం సభ్యులు గాదంశెట్టి రాజు మాట్లాడుతూ మేడిపల్లి సెంటర్ నుండి భరత్ నగర్ బోర్డు వరకు 80 ఫీట్ల రోడ్డు వెడల్పు కారణంగా ఇక్కడ చాలా మంది వ్యాపారులు తమ భవనాలను కోల్పోయి , వ్యాపారం కూడా బాగా దెబ్బతినే పరిస్థితి ఉందని దీటి బాలరాజు సహాయంతో ఎమ్మెల్యే కు తెలుపగా దాన్ని ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా 70 ఫీట్లకు కుదిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయంతో వ్యాపార వర్గాల్లో, ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీటి బాలరాజు, అల్లి శంకర్, ఎన్టిపిసి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రావికంటి వరప్రసాద్, ముచ్చ కూర్తి రమేష్, ఎన్ అశోక్, పి రాజేశం, అంజయ్య, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయునికి విశ్వ విభూషన్ జాతీయ పురస్కారం



**అగ్నిధార న్యూస్ మంథని :** శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్ సాహితి సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం 2025 విశ్వకర్మ జాతీయ పురస్కారాల సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్టమైన కృషి చేసినందుకు తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శ్రీ రాజ్యలక్ష్మి కన్వెన్షన్ హాల్లో జరిగిన పురస్కారాల ప్రధానోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం మల్లారం గ్రామానికి చెందిన కాశీపేట శ్రీకాంత్ పత్రిక,సామాజిక సేవా రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు అభినందిస్తూ బతుకమ్మ తల్లి గ్రంథకర్త, సహస్ర మహోత్సవ సామ్రాట్, ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, విశ్వ కళావిరాట్ డాక్టర్ శాంతి కృష్ణ చేతుల మీదుగా విశ్వ విభూషన్ జాతీయ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీర ధర్మేంద్రస్వామి హాజరు కాగా అన్ని రంగాలకు చెందిన వారు 200 పైగా పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడెం లింగమూర్తి, డాక్టర్ అప్పినపెల్లి భాస్కరాచార్యులు, డాక్టర్ వలబోజు మోహన్ రావు, అద్దంకి కృష్ణమాచార్యులు, హాస్యనటులు ఆర్ ఎస్ నంద, సమాజ సేవకురాలు డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## కరాటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది



**అగ్నిధార న్యూస్,( రామగుండం),:** విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన 29 వ జాతీయ కరాటే పోటీలలో ఎన్టిపిసికి చెందిన మల్లేపల్లి మంజునాథ్ కరాటే బ్లాక్ బెల్ట్ గ్రాండ్ ఛాంపియన్షిప్ 2025 సాధించాడు. కటాస్ లో జోష్ణ శ్రీ, సహస్ర, సోహన్, సమీర్ సింగ్ ,శ్రీనిషా, సహస్రత్, అనీష్ ,నిహాన్,, నిహంత్ ఠాకూర్ యుక్త గోల్డ్ మెడల్ (ప్రథమ బహుమతులు) ఠాకూర్ మహి కారుణ్య స్వాతి శ్రీనిధి హర్షిత్ మోక్షిత్ ద్వితీయ బహుమతులు లిఖిత్ ఆరో రీసా ఆదిత్య సాకృతి అభ్యుదయలు తృతీయ బహుమతులు సాధించారు. పార్కింగ్ కమిటీ విభాగంలో గౌతం, మంజునాథ్, సహస్ర, వైష్ణవి హర్షవర్ధన్ అక్షిత్ ప్రథమ బహుమతులు శ్రీవల్లి, సాత్విక ద్వితీయ స్థానాలు ద్విజేష్ అర్చన లక్ష్మీ శ్రీ హర్ష అశ్విత సాయిలు తృతీయ స్థానాలు సాధించారు. రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ వడ్డేపల్లి సురేష్ మాస్టర్ బోయ్యబోతు రాముల ఆధ్వర్యంలో ల ఆధ్వర్యంలో 33 మంది పాల్గొన్నారు. తమ కృషి, శిక్షణ, ప్రతిభతో మెరిసిన విద్యార్థులను వారు అభినందించారు.. ఈ ఛాంపియన్షిప్ పోటీలలో మొత్తం 33 మంది వ పాల్గొనగా ఇందులో 9 మంది స్వర్ణ పథకాలు, 6 మంది రజత పథకాలు, 6 కాంస్య పథకాలు సాధించి ప్రతిభను చాటారు. స్పారింగ్ (కమిటీ) విభాగంలో 6 గురు ప్రథమ బహుమతి, ఇద్దరు ద్వితీయ బహుమతి, నలుగురు తృతీయ స్థానాలు సాధించారు ఈ విజయంతో పెద్దపల్లి జిల్లాను జాతీయ స్థాయిలో కీర్తి పొందిందని ఈ గొప్ప విజయంలో విద్యార్థులకు శిక్షణ అందించిన కోచ్ సురేష్ మాస్టర్ ను రాము మాస్టర్ ను విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు ప్రజాసంఘాల నాయకులు అభినందించారు.

## సింగరేణి డాక్టర్ కు సన్మానం



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి ఏరియా ఆసుపత్రిలో సింగరేణి డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్, పి, ప్రసన్నకుమార్ ను ఘనంగా సన్మానం జరిగింది, డివై సీఎంగా ఇటీవలే పదోన్నతి పొందిన డాక్టర్, ప్రసన్నకుమార్ గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి లో బాధ్యతలు స్వీకరించడంతో, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్ చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు, బొకే అందించి శాలువలతో ఘనంగా సన్మానించారు, పదోన్నతి పొందినందుకు స్వీట్స్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, సీనియర్ జర్నలిస్టు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్, సభ్యులు ఆర్నకొండ వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సీనియర్ నాయకులు, పానుగంటి రాజలింగం, కొంకటి వెంకటేష్, కొంకటి సిద్ధార్థ, ఆలయ ఫౌండేషన్ సభ్యులు మూగల మహేష్, రామంచ తిరుపతి మూగల,మహేష్, కొలుగూరి వెంకటేష్,పోగుల శేఖర్ తదితరులు ఉన్నారు,

## యాదవ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలంటీర్ల నియామకం

**త్వరలో మధ్యాహ్న భోజనం.**

**ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు నిత్యం వివిధ రకాల ఆనారోగ్యంతో వచ్చే బాధితులకు సేవలందించేందుకు పెద్దపల్లి జిల్లా అఖిలభారత యాదవ మహాసభ, యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం (4) నలుగురు వాలంటీర్లను నియమించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్, కోశాధికారి మేకల మల్లేశం యాదవ్, మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు నిత్యం వచ్చే బాధితుల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ నియంత్రణతో పాటు వివిధ రకాల సేవలందించేందుకు యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, జిల్లా యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేణి రాజేందర్ యాదవ్, ట్రస్ట్ కోశాధికారి మేకల మల్లేశం యాదవ్, ఓదెల మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్, ఎన్ఆర్ఐ కొలుముల దామోదర్ యాదవ్ సహకారంతో నలుగురు వాలంటీర్లను నియమించేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను అనుమతి కోరగా వెంటనే స్పందించి సోమవారం జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ట్రస్టు ద్వారా సేవలందించేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, సూపరిండెంట్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వాలంటీర్లు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 ఒంటిగంట వరకు సేవలందించనునట్లు తెలిపారు. అలాగే త్వరలోనే రోగులకు టోకెన్ పద్ధతిలో 50 మందికి సరిపడు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ హాస్పిటల్ కు వచ్చే బాధితులకు సేవలందించేందుకు ముందుకు వచ్చిన యాదవ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో 210, ఈ నెలలో ఇప్పటికి 129 డెలివరీలు చేశామని తెలిపారు. త్వరలో సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్, యంత్రాలను అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ట్రస్ట్ ద్వారా సేవలందించడంతో హాస్పిటల్ కు వచ్చే బాధితులకు అన్ని రకాల సేవలు చేయడానికి వైద్య బృందం 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ విజయ్ కుమార్, మేకల మల్లేశం యాదవ్, సందనవేణి రాజేందర్ యాదవ్, శిలారపు పర్వతాలు యాదవ్, కావేటి రాజగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మానసిక వికలాంగుల కేంద్రంలో పండ్లు, కిరాణా సామాను పంపిణీ

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** ప్రవక్త మహ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినోత్సవ కార్యక్రమాల భాగంగా జమాత్-ఎ-ఇస్లామీ హింద్ పెద్దపల్లి యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం రోజున పెద్దపెల్లిలోని మానసిక వికలాంగుల కేంద్రంలో పండ్లు, కిరాణా సామాను పంపిణీ కార్యక్రమం నిర్వహించబడిందనీ జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షులు ఎంఎ మోహీద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవక్త మహ్మద్ (స.అ) అందరికీ మానవ జీవితం కోసం సంపూర్ణ ఆదర్శం అనే పిలుపుమేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు, జమాత్ వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని ఇది ప్రవక్త మహ్మద్ (స.అ) బోధనలకు ప్రతిబింబం ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, మానవతకు కరుణ చూపడం,ఇతరులకు ఎక్కువ ఉపయోగం చేసే వారే ఉత్తములు అలాగే 'తన పొరుగువాడు ఆకలితో ఉండగా, తాను తిండి తిని పొట్ట నింపుకునే వాడెవడో అతను నిజమైన విశ్వాసి కాదు.' ఈ బోధనల పట్ల నిబద్ధతతోనే జమాత్ ఈరోజు కార్యక్రమాన్ని నిర్వహించిందని తెలిపారు.ప్రవక్త మహ్మద్ (స.అ) రహ్మతుల్ లిల్ ఆలమీన్ సమస్త మానవజాతికి కరుణగా పంపబడ్డారు. ఆయన జన్మదినాన్ని జరుపు కోవడం అంటే ఆయన జీవిత చరిత్రను అధ్యయనం చేసి, ఆయన మానవతా బోధనలను మన జీవితంలో ఆచరించడం" అని పేర్కొన్నారు. అలాగే, రాబోయే రోజుల్లో వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు, పేదల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జమాత్ ప్రకటించింది. ఇవన్నీ ఒక నెలపాటు జరగబోయే ప్రవక్త జన్మదినోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఉంటయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సయ్యద్ మతీనుద్దిన్,అరీఫుద్దిన్, సయ్యద్ ఇమ్రాన్ సూఫీ,రహీమ్ అజీజీ, రౌఫ్ అజీజీ, వాహెద్, షేక్ అహ్మద్, జమీర్నుద్దిన్, మహ్మూద్ హుస్సైన్, మహ్మద్ జమీర్, సయ్యద్ ముజాఫరుద్దిన్, నౌషీద్ అలీ సయ్యద్ హాషీర్, ముసాబ్ అబ్రార్, జిమ్రాన్ మొహియుద్దిన్, సయ్యద్ ముజాయిపుద్దీన్ మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ అమలులో కుట్ర

**రోస్టర్ విధానం వల్ల మాలలకు అన్యాయం.**

**మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** ఎస్సీ వర్గీకరణ అమలులో పాలకుల కుట్ర ఆగలేదని, దీంతో మాలలకు అన్యాయం జరిగిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో మాల మహా నాడు జిల్లా అధ్యక్షుడు మద్దెల నర్సయ్య అధ్యక్షతన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాలకుల గెలుపు కోసం పాటు పడితే ఏప్రిల్ 18 న ముఖ్యమంత్రి జీఓ ఇచ్చి అన్యాయం చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మాలలు వ్యతిరేకం కాదని, సామాజిక న్యాయం జరగటం లేదని విమర్శించారు. రోస్టర్ విధానం వల్ల శాతవాహన యూనివర్సిటీలో 33 గెస్ట్ లెక్చరర్ పోస్టులు భర్తీలో ఒక్కరికి కూడా పోస్ట్ రాలేదని గుర్తు చేశారు. రోస్టర్ విధానంతో పిల్లల భవిష్యత్తు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల 22 స్థానంలో మాలలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం రోస్టర్ విధానంపై చర్చించి సవరణ చేయాలని డిమాండ్ చేశారు. మన హక్కుల కోసం ప్రజలకు వివరించి పోరాటంలో భాగస్వాములు చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. నవంబర్ 26 ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, ఉపాధ్యక్షులు ఆశాది పురుషోత్తం, నాయకులు ఎలుక దేవయ్య, జైభీమ్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కట్టెకోల మధు, నాయకులు మాదాసి చందు, తదితరులు పాల్గొన్నారు.

## పగలేమో బొంతల పని... రాత్రి దొంగతనాలు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** పగటిపూట బొంతలు కుట్టే వ్యాపారం పేరుతో సంచరిస్తూ, రాత్రి వేళల్లో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు సభ్యులను పట్టుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.25 వేలు నగదు, 25 గ్రాముల బంగారం, 43 తులాల వెండి, ఓమ్ని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన ఈ దొంగలు పెద్దగూడెం తండాలో బాణావత్ ప్రసాద్ ఇంట్లో తాళం పగలగొట్టి రూ.1.20 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపినట్లు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం: సిపిఐ



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి కే విజయరాములు అన్నారు. సోమవారం వనపర్తి ఆఫీసులో పృథ్వీనాదం అధ్యక్షతన వనపర్తి పట్టణ కౌన్సిల్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఎంపికలో లోపాలు ఉన్నాయని, అర్హులైన పేదలకు అందటం లేదన్నారు. జిల్లాలో రైతులకు యూరియా ఎరువులు అందక గోస పడుతున్నారనితగినంత యూరియా అందించాలన్నారు. యూరియా సరఫరా లో వైఫల్యాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెట్టుకొని బాధ్యతలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. రైతులు క్యూలో గంటల తరబడి నిలబడి ఆకలి దప్పులకు అల్లాడుతున్నారని అయినా ప్రభుత్వం చెల్లించటం లేదన్నారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన యూరియా కోట మొత్తాన్ని వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 17 న తెలంగాణ సాయుధ రత్తంగా పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, పట్టణ మాజీ సహాయ కార్యదర్శి ఎర్రకురుమయ్య, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు పృథ్వీనాదం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు పి.ఎం దక్ష యోజనలో వివరాలు నమోదు చేసుకోవాలి

## సీనియర్ సివిల్ జడ్జి రజిని




**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:**వికలాంగులు పి.ఎం దక్ష యోజనలో వివరాలు నమోదు చేసుకోవాలి అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి రజని అన్నారు. సోమవారం వనపర్తి జిల్లలోని పెబ్బేరు మండలంలో వికలాంగుల పునరావాస కేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వికలాంగులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి రజని మాట్లాడుతూ మానసిక మరియు శారీరక బాల దివ్యాంగులను పునరావాస కేంద్రాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా దివ్యాంగ్ జన్ రోజ్ గర్ సేతు, దివ్యాంగ్ జన్ కౌశల్ వికాస్ పథకాల గురించి వివరించారు. దివ్యాంగులు అందరికీ కూడా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు అందిస్తామని తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. అదేవిధంగా పెబ్బేర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి రజని విద్యార్థులకు బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం, ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు చట్టం, ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. మరియు పెబ్బేర్ లోని మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలను సందర్శించి పాఠశాలలో లీగల్ లిటరసీ క్లబ్ ను ప్రారంభించి క్లబ్ లో ఉన్న ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు నిర్వర్తించవలసిన కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమాలలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, కళాశాల ప్రధానోపాధ్యాయులు ఓబుల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత మరియు పారా లీగల్ వాలంటీర్లు సుశీల, శేఖర్ చారి పాల్గొన్నారు.

# రామగుండంను నవ నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తున్నాం

## స్థానిక శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండం నగరం నవ నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తున్నామని స్థానిక శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంఖు స్థాపన చేశారు. ట్రాన్స్ ఫర్ డ్యూటి నిధులు రూ 186.50 లక్షలతో ఆర్ టి సి కాలనీ, కె సి ఆర్ కాలనీ పద్మావతి కాలనీ ఆర్ కె గార్డెన్స్ ఏరియా మార్కండేయ కాలనీ దుర్గా నగర్ భవానీ నగర్ ప్రాంతాల్లో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు అడ్డగుంటపల్లిలో ట్రాన్స్ ఫర్ డ్యూటి నిధులు రూ 197.00 లక్షలతో రాజీవ్ నగర్ ,సంతోష్ నగర్ ఇందిరా నగర్ న్యూ మారేడు పాక విట్టల్ నగర్ భీముని పట్నం మేడిపల్లి ఆటో నగర్ గోపాల్ నగర్ లలో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు యైటింక్ లైన్ కాలనీలో జిల్లా నిధులు 100.00 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణంలో మిగిలిపోయిన పనులు పూర్తి చేసే పనులకు అశోక్ నగర్ ( గోదావరి ఖని ) బాలికల పాటశాలలో అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ తో కలిసి భూమి పూజ నిర్వహించి శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సింగరేణి క్వార్టర్ల ఏరియా సంబంధం లేకుండా పేద మధ్య ధనిక వర్గాల వారు రిటైర్డ్ కార్మికులు ఎక్కువగా నివసిస్తున్న మార్కండేయ కాలనీ ప్రాంతంలో కనీస సదుపాయాలు లేని విషయం గుర్తించి ఎం ఎల్ ఎ గా ఎన్నికై న వెంటనే ప్రభుత్వం ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేయించి వీధి వీధికి యు జి డి సి సి రోడ్లు నల్లా కనెక్షన్లు వీధి దీపాలు ఏర్పాటు చేయించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. రామగుండం నగరం లో మార్కెట్ పెంచడమే ధ్యేయంగా రోడ్ల విస్తరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రామగుండం ను ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే నగరంగా తీర్చి దిద్దడానికి కొత్తగా భారీ విద్యుత్ కర్మాగారాల ఏర్పాటు చేయడం జరగనుందని అన్నారు. విద్యాకేంద్రంగా తీర్చిదిద్దాడానికి వైద్య నర్సింగ్ కళాశాలలను అభివృద్ధి చేస్తుండడంతో పాటు రూ 250 కోట్లతో ఇంటిగ్రే టెడ్ పాట శాల నిర్మాణం పి జి సెంటర్ ను విశ్వ విద్యాలయ స్థాయికి పెంచే విధంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎం సి ఎ, ఎం బి ఎ కోర్సుల కొరకు ప్రత్యేక భవనాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సింగరేణి ఆసుపత్రిలో క్యాత్ లాబ్ ఏర్పాటు చేయించి హృద్రోగ చికిత్స కోసం అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెల్ల వలసిన అవసరం లేకుండా ఇక్కడే వైద్య చికిత్స అందరికీ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అందరికీ అన్ని రకాల వ్యాధులకు వైద్య అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి లో మరో రెండు భవన బ్లాకులు సిద్ధం చేయిస్తున్నామని అన్నారు. గోదావరి ఖని నుండి సెంటెనరీ కాలనీ వరకు నాలుగు వరసల రహదారి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని అన్నారు. సుమారు రూ 20 కోట్లు వెచ్చించి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. బాలికల పాటశాల లో విద్యార్థులకు అవసరమైన డైనింగ్ హాల్ తో పాటు ప్లే గ్రౌండ్ కూడా అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కిచ్చిన హామీలను అన్నీ తీరుస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ డి ఇ లు షాభాజ్ శాంతి స్వరూప్ జమీల్ ఎ ఇ లు మీర్ సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ ఎం ఇ ఓ జింక మల్లేశం తాజా మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి బొంతల రాజేష్ శంకర్ నాయక్ సాగంటి శంకర్ కొలిపాక సుజాత పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, మెప్మా టి ఎం సి మౌనిక సి ఓ లు ఊర్మిళ శ్వేత శమంత బాలికల పాటశాల అధ్యాపక సిబ్బంది నాయకులు విద్యార్థులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్సీల పరిధిలో అభా కార్డు లను వేగంగా జనరేట్ చేయాలి

**మహిళలు, పిల్లలకు ఆరోగ్య సేవల కోసం స్వస్థ్ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలి**

**వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో స్వస్థ్ నారీ, సశక్తి పరివార్అభియాన్ కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, పిల్లల సాధికారతే స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పీహెచ్సీల పరిధిలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అన్ని పీహెచ్సీల పరిధిలో స్పెషలిస్ట్ డాక్టర్ల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ముఖ్యమైన సేవలను అందించనున్నట్లు తెలిపారు.అయితే ఇందుకోసం ముందుగా మెడికల్ ఆఫీసర్లు తమ పరిధిలో ఉన్న మహిళలకు బీపీ, షుగర్, టీబీ స్క్రీనింగ్ వంటి ప్రాథమిక పరీక్షలు చేసి వారి డేటాను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ప్రజలు ఏ ఆరోగ్య సమస్యతో అయితే ప్రధానంగా ఇబ్బంది పడుతున్నారో గుర్తించలన్నారు. అందుకు సంబంధించిన స్పెషలిస్ట్ డాక్టర్ తమ పీహెచ్సీ క్యాంపుకి వచ్చినప్పుడు వారికి ట్రీట్మెంట్ ఇప్పించాలని సూచించారు. ఇందుకోసం శిబిరానికి వచ్చే వారికి హెల్త్ కార్డు రూపంలో ఒక కార్డు ఇవ్వాలని సూచించారు. ఏ స్పెషలిస్ట్ డాక్టర్, ఏ రోజున ఏ పీహెచ్సీ క్యాంపు సందర్శించనున్నారనే వివరాలను సమర్పించాలని వైద్య శాఖ అధికారిని ఆదేశించారు. ఇక అన్ని పీహెచ్సీల పరిధిలో అభా కార్డు లను వేగంగా జనరేట్ చేయాలని ఆదేశించారు. ఈ స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో సామ్ చిన్నారులు తప్పనిసరిగా కవర్ కావాలని చెప్పారు. సామ్ పిల్లల వివరాలను సమర్పించాలని డి డబ్ల్యు ఓ ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సాయినాథ్ రెడ్డి, రామచంద్రరావు, మెడికల్ ఆఫీసర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిధార
http://www.agnidharanews.com

# రోడ్ల పై మద్యపానం సేవించడం నిషేధం

**– జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**– వైన్స్ లు ,బార్, రెస్టారెంట్ ల ముందు రోడ్ల పై మద్య పానం సేవిస్తే భారీ జరిమానాలు విధించాలి**

**– మద్యపాన నియంత్రణ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**






అగ్నిధార న్యూస్ పెద్దపల్లి :రోడ్లపై మద్యపానం సేవించడం నిషేదమని దీని నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మద్యపాన నియంత్రణ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ....**

జిల్లాలో ఎక్కడ వైన్ షాప్ లు, బార్ ల ముందు బయట రోడ్లపై మద్యం సేవించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వైన్ షాప్ సమీప ప్రాంతంలో రోడ్లపై మద్యం సేవించడం వల్ల అక్కడ పారిశుధ్య నిర్వహణ, రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు.వైన్ షాప్ వద్ద పర్మిట్ అనుమతి ఉంటే పర్మిట్ రూంలో మాత్రమే మద్యం సేవించాలని, లేని పక్షంలో ఇంటి వద్ద మద్యం సేవించాలని, రోడ్లపై బహిరంగంగా ఎక్కడ మద్యం సేవించడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు.వైన్ షాప్, బార్ అండ్ రెస్టారెంట్ల ముందు రోడ్ల పై మద్యం సేవిస్తే మున్సిపల్ కమిషనర్లు సంబంధిత వైన్ షాప్ లు, బార్ రెస్టారెంట్ ల ముందు వారి పరిసరాలలో చెత్త వేస్తే మున్సిపల్ చట్టం – 2019 ప్రకారం సంబంధిత వైన్స్ లు, బార్ అండ్ రెస్టారెంట్లు ల పై రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు భారీ జరిమాణాలు విధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అబ్కారి శాఖ అధికారి మహిపాల్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్లు వెంకటేష్, వెంకన్న, రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు వ్యాక్సినేషన్ చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

రోడ్లపై పశువులు ఉండరాదు.

పశువుల నియంత్రణ చర్యల పై సమీక్ష.

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, సెప్టెంబర్ –15: రోడ్లపై పశువులకు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పశువుల నియంత్రణ చర్యల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రోడ్లపై ఎక్కడ కుక్కలు, పశువులు, కోతులు, పందులు, కనిపించకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆవులు పశువులు రోడ్లపై ఉంటున్నాయని ఉదయం రాత్రి తేడా లేకుండా ఎప్పుడు రోడ్లపైనే సంచరిస్తున్నాయని వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకొని వెంటనే వాటిని సమాంత గోశాలకు తరలించాలని రోడ్లపై పశువుల ద్వారా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, కుక్కలు వీధులలో తిరగకుండా ఎవరిపై దాడి చేయకుండా ఉండేందుకు ముందస్తుగా వాటిని తరలించాలని, పశువులన్నింటికీ తప్పనిసరిగా వాక్సినేషన్ చేసి యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) స్టెప్స్ ఫాలో కావాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలోజిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ,మండల పంచాయతీ అధికారులు, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ లు, వెటర్నరీ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే మక్కాన్సింగ్ పాలన హిట్లర్ పాలనను తలపిస్తోంది

**బిఆర్ఎస్ పార్టీ బంద్ ను నిర్వీర్యం చేసేందుకు వ్యాపారస్తులు బెదిరింపులు.**

**ప్రశ్నిస్తే కేసులు... అడిగితే కుల్చివేతలు.**

**కమిషన్ల కోసమే కట్టాడాలు = చిరువ్యాపారులకు పక్షాన మెము పోరాడుతాం అండగా ఉంటాం.**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్.**




**గోదావరిఖని:** రామగుండం లో ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ ఓ నియంతలాగా వ్యవహరిస్తున్నాడు.... ఎమ్మెల్యే చేస్తున్న పాలన హిట్లర్ పాలన తరహాలో సాగుతుందని, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం అడిగితే కుల్చివేతలు, కమిషన్ల కోసమే కట్టాడాల నిర్మాణాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ గారు అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ నియంత నియంతృత్వ ధోరణి అద్దం పడుతుందన్నారు. లక్ష్మీ నగర్ లో వ్యాపారస్తులు బెదిరింపులకు గురి చేస్తూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన రామగుండం పారిశ్రామిక ప్రాంత బంద్ ను విఫలం చేసేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పేరిట చిరు వ్యాపారస్తుల దుకాణాలలో కూల్చి వేస్తూ వారి జీవితాలను రోడ్డుపై పడవేశారని అన్నారు. కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారో, దుకాణం దారులకు ఎలాంటి ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా కుల్చివేతలు చేస్తున్నరన్నారు. రోడ్డు వెడల్పు కోసం చేపడుతున్న ప్రణాళికలుఇక్కడి ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రజాప్రతినిధి ఉందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన బంద్ కు సహకరించవద్దని లక్ష్మీ నగర్ వ్యాపారస్తులు బందులో పాల్గొంటే మరో ఐదు సీట్లు భవనాలను తొలగిస్తామని చెప్పి బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. రామగుండం లో హిట్లర్ తరహ పాలన చేస్తున్న ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ ప్రజల నుంచి తిరుగుబాటు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని గాంధీనగర్ లక్ష్మీనగర్ , ఎన్టీపీసీలో కుల్చివేసినా దుకాణదారులకు నష్టపరిహారం చెల్లించాలని వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని డిమాండ్ చేసారు. బి.ఆర్.ఎస్ పార్టీ చిరు వ్యాపారులు పట్ల పోరాడుతుందని వారికి అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు గోపు అయులయ్య యాదవ్ మాజీ కార్పోరేటర్లు గాధం విజయ కల్వచర్ల కృష్ణ వేణీ బాదె అంజలి నాయకులు బోడ్డు రవీందర్ బోడ్డుపల్లి శ్రీనివాస్ ఆర్నపల్లి శ్రీనివాస్ మేడి సదానందం నూతి తిరుపతి మేతుకు దేవరాజ్ సట్టు శ్రీనివాస్ ముద్దసాని సంధ్యా రెడ్డి బుర్ర వెంకటేష్ వెంకటస్వామి ఇరుగురాళ్ల శ్రావన్ రాజ్ కుమార్ చింటూ కిరన్ జీ రామారాజు తదితరులు

## విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా జరపాలి

**హైదరాబాద్ :** తెలంగాణ విమోచన దినోత్సవ వివరాలు భావితరాలకు తెలియాలని ఆ దిశగా ప్రభుత్వం అధికారికంగా దానిని జరపాలని మాజీ గవర్నర్ సి.ఎచ్ విద్యాసాగర్ రావు డిమాండ్ చేశారు.హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 17 సెప్టెంబర్ ముమ్మాటికీ విమోచనే పేరుతో రాసిన పుస్తకాన్ని విద్యాసాగర్ రావు విడుదల చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి 1947 లో స్వాతంత్ర్యం వచ్చిందని కానీ తెలంగాణా కు మాత్రం ఏడాది తర్వాత పోలీసు చర్యతో విమోచనం లభించిందన్నారు.దీని వివరాలు కచ్చితంగా మన ముందు తరాలకు తెలియాల్సి న అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విమోచన దినోత్సవ అంశాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు.కొమురం భీం,షాయబుల్ల ఖాన్,సహా నాటి నేతల వివరాలు చెప్పాలన్నారు.తెలంగాణ లోని భైరన్ పల్లి,పరకాల ఘట్టాలు కూడా పుస్తకాల్లో చేరిస్తే భవిష్యత్ తరాలకు చరిత్ర తెలుస్తుందన్నారు.1998 లో తాము తొలిసారిగా విమోచన దినోత్సవ స్వర్ణోత్సవాలు జరిపమని విద్యాసాగర్ రావు తెలిపారు.ప్రభుత్వం వెంటనే అధికారికంగా విమోచన దినోత్సవ వేడుకలు జరపాలని కోరారు.

## కవితక్క నువ్వు సూపర్

**హైదరాబాద్ :** కొడంగల్ నారాయణపేట్ ఎత్తిపోతల పథకం నిర్వాసిత రైతులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలంలోని కానుకుర్తి గ్రామాన్ని జూలై 31న సందర్శించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతుపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పథకం కోసం భూములు కోల్పోతున్న రైతుల పక్షాన గళమెత్తిన కవితకు రైతులు అక్షరంగా "అక్కా.. మీ వల్లనే మా భూముల పరిహారం రూ.14 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెరిగింది" అంటూ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సంతకాలతో లేఖలు రాస్తూ కవితకు కృతజ్ఞతలు తెలిపారు. వారి భూములు కోల్పోతున్న నేపథ్యంలో, తగిన నష్టపరిహారం లభించకపోతే తమ జీవితం అడుగడుగునా అస్తవ్యస్తమవుతుందని వారు వివరించారు. ఎమ్మెల్సీ కవిత రైతుల తరపున ధీటుగా నిలబడుతూ, "ఎకరానికి కనీసం రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి" అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాదు, పరిహారం పెంచేవరకు రైతులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.రైతులపై ప్రభుత్వ నియంత్రణ, పోలీసులు నిర్బంధానికి పాల్పడి భూములను బలవంతంగా లాక్కునే ప్రయత్నాలను కవిత తీవ్రంగా ఖండించారు. ఈ అంశాన్ని బయటపెట్టి ప్రజల ముందుకు తీసుకువచ్చారు. కవిత ఒత్తిడి, రైతుల నిరంతర పోరాటం ఫలితంగా చివరికి రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి "ఒక్కో ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని" అధికారికంగా హామీ ఇచ్చింది. ఈ నిర్ణయంతో ప్రాజెక్టు నిర్వాహిత రైతులు జాగృతి అధ్యక్షురాలు కవితకు ధన్యవాదాలు తెలిపారు. "నిజంగా అక్కా, మీరు లేకపోతే ఈ న్యాయం జరిగేది కాదు" అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

## హనీ ట్రాప్ చేసి దొరికిపోయారు

**హైదరాబాద్ :** కష్టపడకుండానే కోట్లు సంపాదించాలి..! గడప దాటకుండానే ఇంటికి డబ్బు రావాలని ఆలోచించిన ఓ గ్యాంగ్? యోగా గురువుని ట్రాప్ చేసింది. బ్యాగ్రౌండ్ చెక్ చేసుకునిమరీ రంగంలోకి దిగింది. కానీ సులభ సంపాదన చిక్కులు తెస్తుందని ఆతర్వాతే ఆ గ్యాంగ్‌కు అర్థమైంది. ఈజీ మనీ అంత ఈజీ కాదని బుర్రకెక్కింది. ఫలితంగా జైల్లో ఊచలు లెక్కబెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్లలో ఉన్న యోగా ఆశ్రమమిది. రోజూ వందలాది మంది వచ్చిపోయే ప్రాంగణమిది. రంగారెడ్డి అనే ఓ యోగా గురువు ఈ ఆశ్రమాన్ని ఎన్నో ఏళ్లుగా నడుపుతున్నాడు. ఇక యోగా ఆశ్రమం అనగానే దేశ, విదేశాల నుంచి ఎంతో మంది వస్తుంటారు?! వచ్చినవాళ్లు పెద్ద ఎత్తున నిధులు ఇస్తుంటారు?! ఇదే విషయాన్ని కొన్నాళ్లుగా గమనించిన అమర్ అండ్ గ్యాంగ్. ఎలాగైనా యోగా గురువు దగ్గరున్న డబ్బును ఈజీగా కొట్టేయాలని పక్కా ప్లాన్ వేసింది.అట్లాంటిట్లాంటి ప్లాన్ కాదిది?! గట్టిగా ఇరికించాలి? దండిగా డబ్బు రాబట్టాలంటూ ఇద్దరు మహిళలతో యోగా గురువు రంగారెడ్డిపై హనీ ట్రాప్ వల విసిరింది అమర్ గ్యాంగ్. బాగా ట్రైన్ చేసి అనారోగ్య సమస్యల పేరుతో ఇద్దరు మహిళలను ఆశ్రమంలోకి పంపింది. ఇక ఆశ్రమంలోకి దిగిన కొన్నిరోజులకే ఆ మహిళలు రంగారెడ్డితో క్లోజ్‌గా మూవ్ కావడం మొదలుపెట్టారు. నకిలీ ప్రెస్ కార్డులతో కొన్న స్పై కెమెరాలు వాడి రంగారెడ్డితో సన్నిహితంగా ఉంటూ ఫోటోలు, వీడియోలు తీశారు. ఇకా వీడియోలను అమర్ గ్యాంగ్‌కు పంపారు. ఇకప్పుడు రంగంలోకి దిగిన గ్యాంగ్.. గురువును బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టింది . మొదట 50 లక్షల రూపాయలు డిమాండ్ చేశారు? అయితే వాటికి సంబంధించిన చెక్కులను వాళ్లకిచ్చాడు రంగారెడ్డి. ఆ తర్వాత కోట్లకు ప్లాన్ వేశారు కేటుగాళ్లు. రెండు కోట్లు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. ఇక పరిస్థితి గమనించిన గురువు గంగారెడ్డి తానో మాస్టర్ ప్లాన్ వేసి అమర్ గ్యాంగ్‌కు దిమ్మతిరిగే ట్విస్ట్ ఇచ్చాడు.రెండు కోట్లు ఇచ్చేందుకు ఓకే చెప్పాడు రంగారెడ్డి. డబ్బులు ఇచ్చేందుకు గొల్కొండకు రావాలని అటు అమర్ గ్యాంగ్‌ను పిలిచాడు? ఇటు పోలీసులకు సమాచారమిచ్చాడు. ఫలితంగా అమర్ గ్యాంగ్ పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికింది. అమర్‌తోపాటు మౌలాలి, రాజేష్, మంజుల, రజినీలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా విచారణ మొదలుపెట్టారు. నిందితులు అంతా రియల్ ఎస్టేట్‌లో ఉన్నట్లు గుర్తించారు. ట్రాప్ చేయడం ఇదే మొదటిసారా? ఇలానే ఇంకేమైనా చేశారా..? అన్న కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

## మంచిర్యాలలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్

**అదిలాబాద్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. దేశంలో వేగవంతమైన రైళ్లలో ఒకటైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఇకపై మంచిర్యాలలో కూడా హాల్టింగ్ ఇవ్వనుంది. మంచిర్యాల రైల్వే స్టేషన్లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వందే భారత్ రైలుకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్ తో పాటు రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి కూడా పాల్గొన్నారు. వందే భారత్ రైలు ప్రారంభం సందర్భంగా పెద్ద ఎత్తున బీజేపీ కార్యకర్తలు మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు తరలివచ్చారు.మంచిర్యాల రైల్వేస్టేషన్ లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ స్టాప్ ఇస్తున్నారని బీజేపీ కార్యకర్తలు స్టేషన్‌కు చేరుకుని హంగామా చేశారు. "జై బీజేపీ", "జై బండి సంజయ్" నినాదాలతో రైల్వేస్టేషన్ ప్రాంగణం మారుమోగింది. కార్యకర్తల నినాదాలతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొనడంతో, బండి సంజయ్ స్పందించారు. ఇట్లా నినాదాలు, గొడవలు చేసి డిస్ట్రబ్ చేస్తే ఒక్క అభివృద్ధి పని కూడా రాదు. ఇది మనం గుర్తుంచుకోవాలి అని హితవు పలికారు. ఆయన వ్యాఖ్యలతో కార్యకర్తలు శాంతించారుబండి సంజయ్ మాట్లాడుతూ.. 'దేశ వ్యాప్తంగా 150 వందే భారత్ రైళ్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. తెలంగాణలో 5 వందే భారత్ రైళ్లు నడుపుతున్నాం. అతి త్వరలో హైదరాబాద్ నుంచి పుణే, హైదరాబాద్ నుంచి నాందేడ్ కు నడపనున్నాం. తెలంగాణలో జాతీయ రహదారులు, రైలు సర్వీసులకు సంబంధించి కేంద్రం కట్టుబడి ఉంది. గతంలో 2014లో తెలంగాణకు రూ.258 కోట్లు బడ్జెట్లో కేటాయించేవారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ రూ.5,300 కోట్లు. బడ్జెట్లో దాదాపు 20 రెట్లు అధికంగా కేటాయింపులు పెరిగాయి. అన్ని రాష్ట్రాల అభివృద్ధితోనే భారత్ అభివృద్ధి సాధ్యం. 40 రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. తెలంగాణకు పదేళ్లు 42000 కోట్లు ఖర్చుచేశాం. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయితే మొత్తం 80 వేల కోట్లు ఖర్చు చేసినట్లు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకంలో భాగంగా రామగుండం, కరీంనగర్, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లను ఎయిర్ పోర్టుల తరహాలో అభివృద్ధి చేస్తున్నాం. చర్లపల్లి రైల్వేస్టేషన్ విమానాశ్రయం లాగ మార్చాం. అమెరికా మూడు విభాగాల్లో డెవలప్ కావడంతో అగ్రస్థానంలో ఉంది. రోడ్లు, రైల్వేలు, విమానశ్రయాల అభివృద్ధితోనే ఇది సాధ్యమైంది. మంచిర్యాలలో వందే భారత్ రైలు హాల్టింగ్ ఇచ్చాం. నష్టాల్లో ఉన్న రైల్వేలను లాభాల బాట పట్టించాం. ఎక్కడ రైలు ఆగితే ప్రజలకు ఉపయోగం, ప్రజల అవసరాలు, డిమాండ్లు దృష్టిలో ఉంచుకుని ఇక్కడ హాల్ట్ స్టాప్ ఏర్పాటు చేశాం.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com